www.prajajwalanews.com

# ప్రజాజ్వాల

తెలుగు దినపత్రిక

బుధవారం | 23-4-2025 | సంపుటి: 14 | సంచిక: 343 | పేజీలు : 8 | వెల : 4/- | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

RNI No.APTEL 2010/33408
ప్రజాజ్వాల
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును
చీఫ్ ఎడిటర్ మాదగారి సుగ్రీవుడు, 9441284503

# నెత్తురోడిన కశ్మీరం...



- పర్యాటకులపై ఉగ్ర దాడి.. కాల్పులకు 26 మంది బలి
- 20 మందికి పైగా గాయాలు.. మృతుల్లో ఇద్దరు విదేశీయులు
- రక్తసిక్తమైన 'మినీ స్విట్జర్లాండ్'..
- పహల్గాం సమీపంలో ఘటన
- మా పనే: లష్కరే ముసుగు సంస్థ టీఆర్ఎఫ్
- ముష్కరులను వదలబోం: మోదీ..
- సౌదీ నుంచి అర్థాంతరంగా వెనక్కి
- హుటాహుటిన కశ్మీర్‌కు అమిత్ షా..
- వాన్స్ పర్యటిస్తుండగానే ఘటన
- తీవ్రంగా ఖండించిన ట్రంప్, పుతిన్..

పహల్గాం/శ్రీనగర్/న్యూఢిల్లీ: అందాల కశ్మీరం ఎరుపెక్కింది. ఉగ్ర ఉన్మాదం మరోసారి ఒళు విరుచుకుంది. పర్యాటకులపై తూటాల వర్షం కురిసింది. వారిపై ఉగ్ర ముష్కరులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాంలోని బైసారన్ ప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ దారుణానికి 26 మంది పర్యాటకులు బలయ్యారు. 20 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు విదేశీయులున్నారు. వారిలో ఒకరు నేపాలీ కాగా మరొకరిది యూఏఈ. మరో ఇద్దరు స్థానికులు కాగా మిగతావారు కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్, యూపీ, బిహార్ తదితర రాష్ట్రాలకు చెందినవారు. ఐ2019లో పుల్వామాలో సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై టెర్రరిస్టులు కాల్పులకు దిగి 47 మందిని పొట్టన పెట్టుకున్న అనంతరం కశ్మీర్‌లో జరిగిన అతి పెద్ద దాడి ఇదే. దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇది తమ పనేనని పాకిస్తాన్‌కు చెందిన నిషేధిత ఉగ్ర సంస్థ లష్కరే తొయిబా తాలూకు ముసుగు సంస్థ ద రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) ప్రకటించుకుంది. ప్రధాని నరేంద్ర మోదీతో సహా పార్టీలకు అతీతంగా నేతలంతా దాడిని ముక్త కంఠంతో ఖండించారు. ఉగ్రవాదులది మతిలేని ఉన్మాదమంటూ మోదీ మండిపడ్డారు. "ఈ హేయమైన దాడికి పాల్పడ్డ వారిని వదిలే ప్రసక్తే లేదు. వారందరినీ చట్టం ముందు నిలబెడతాం. ముష్కరుల కుటిల అజెండా ఫలించబోదు. ఉగ్రవాదంపై రాజీలేని పోరు జరపాలన్న మా సంకల్పం మరింత బలపడింది" అని ప్రకటించారు. "మృతుల కుటుంబీకులకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడ్డవారు వెంటనే కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. బాధితులందరికీ అన్నివిధాలా సాయం అందజేస్తున్నాం" అని ప్రధాని పేర్కొన్నారు. సౌదీ అరేబియాలో ఉన్న ఆయన విషయం తెలియగానే పర్యటనను అర్ధంతరంగా ముగించుకుని భారత్ తిరిగొచ్చారు. అంతకుముందు సౌదీ నుంచే కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడారు. అనంతరం కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ దేకా తదితర ఉన్నతాధికారులు, ఢిల్లీలో ఉన్న జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తదితరులతో షా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

మిగతా 2లో



## సమష్టితత్వంతో ఏదైనా సాధ్యమని హిరోషిమా చాటింది

- హిరోషిమా అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఆ నగరం మాదిరే పోరాటానికి చిహ్నం తెలంగాణ అని వెల్లడి
- అక్కడి పీస్ మెమోరియల్ పార్క్ వద్ద నివాళి
- ముగిసిన సీఎం బృందం జపాన్ పర్యటన..
- నేడు హైదరాబాద్‌కు రాక

హైదరాబాద్: 'ప్రజలు సమష్టిగా పనిచేస్తే ఏదైనా సాధ్యమని ప్రపంచానికి చూపించిన నగరం హిరోషిమా. హిరోషిమా మాదిరిగానే ప్రజల ఆశలు, ఆకాంక్షలు, పోరాటానికి చిహ్నం తెలంగాణ. దూరదృష్టితో విజయం సాధించిన రాష్ట్రం తెలంగాణ. హిరోషిమా నగరానికి రావడం ఎంతో ఆనందంగా ఉంది'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిరోషిమా అసెంబ్లీలో మాట్లాడుతూ పేర్కొన్నారు. జపాన్ పర్యటనలో చివరి రోజైన మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో కూడిన తెలంగాణ రైజింగ్ బృందం బిజీబిజీగా గడిపింది. రెండో ప్రపంచ యుద్ధంలో భాగంగా 1945 ఆగస్టు 6న అమెరికా జరిపిన అణు బాంబు దాడిలో నామరూపాల్లేకుండా ధ్వంసమైన హిరోషిమా నగరంలో సీఎం రేవంత్ బృందం పర్యటించింది. వివిధ ప్రాంతాలను సందర్శించడంతోపాటు

మిగతా 2లో

## మహేశ్‌బాబుకు ఈడీ సమన్లు



- సాయిసూర్య డెవలపర్స్ కేసులో నోటీసులు
- 28న విచారణకు రావాలని ఆదేశం
- ఈ సంస్థకు ప్రచారకర్తగా పనిచేసిన మహేశ్‌బాబు
- ఆయనకు రూ.5.9 కోట్లు చెల్లించినట్లు గుర్తింపు



## 'భూ భారతి'ని దుర్వినియోగం చేస్తే ఉపేక్షించం: మంత్రి పొంగులేటి



## నేడే హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నిక

- ఉదయం 8 గంటల నుంచి పోలింగ్..
- మొదటి ప్రాధాన్య ఓటు వేస్తేనే చెల్లుబాటు
- పోస్టర్లపై పోలీసులకు ఫిర్యాదు చేశాం
- రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి
- బీఆర్ఎస్‌పై ఈసీకి ఎఫ్‌జీజీ ఫిర్యాదు

హైదరాబాద్: జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక మంగళవారం జరగనుంది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. 31 మంది ఎక్స్ అఫీషియో సభ్యుల కోసం బల్దియా ప్రధాన కార్యాలయంలోని భవన నిర్వహణ విభాగం గదిలో, 81 మంది కార్పొరేటర్ల

మిగతా 2లో

## ఇంటర్ ఫలితాల్లో అమ్మాయిల హవా..

- ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణతలో బాలురపై పైచేయి
- ఫస్టియర్ బాలురు 57.83%.. బాలికలు 73.83%..
- సెకండియర్ బాలురు 57.31%.. బాలికలు 74.21% ఉత్తీర్ణత
- మొత్తంగా రెండేళ్లూ కలిపి 65.81 శాతం ఉత్తీర్ణత నమోదు
- ఫలితాలు విడుదల చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో బాలికలు అత్యధిక శాతం ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో బాలురు 57.83 శాతం పాసయితే, బాలికలు ఏకంగా 73.83 శాతం ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలోనూ బాలికలే పైచేయి సాధించారు. బాలుర ఉత్తీర్ణత శాతం

మిగతా 2లో

# నెత్తురోడిన కశ్మీరం..



(మొదటి పేజీ తరువాయి)

ఆ వెంటనే ప్రధాని సూచన మేరకు వారందరితో కలిసి మంగళవారం రాత్రే ప్రత్యేక విమానంలో హుటాహుటిన కశ్మీర్ చేరుకున్నారు. రాజ్‌భవన్‌లో పరిస్థితిని సమీక్షించారు. "తాజా పరిస్థితిని మోదీకి నివేదించా. ఉగ్ర దాడి నన్ను తీవ్రంగా కలచివేసింది. దాడికి తెగబడ్డవారిని వదిలే ప్రసక్తే లేదు. వారి వెనకున్న సూత్రధారులను కూడా ఉక్కుపాదంతో అణచివేస్తాం" అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయన బుధవారం ఘటనాస్థలిని సందర్శించనున్నారు. ఇది కనీవినీ ఎరగని పిరికిపంద చర్య అంటూ జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మండిపడ్డారు. ఉగ్రవాదుల కోసం పహల్గాం, పరిసర ప్రాంతాలన్నింటినీ భద్రతా దళాలు జల్లెడ పడుతున్నాయి. జమ్మూ కశ్మీర్ అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు కుటుంబసమేతంగా భారత్‌లో పర్యటిస్తున్న వేళ ఈ దాడి జరగడం గమనార్హం. దీన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రంగా ఖండించారు. బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉగ్రవాదంపై రాజీలేని పోరులో భారత్‌కు పూర్తిగా వెన్నుదన్నుగా నిలుస్తామని నేతలిద్దరూ పునరుద్ఘాటించారు. "కశ్మీర్ దారుణం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఈ విషయంలో ప్రధాని మోదీకి, భారత పౌరులకు అన్నివిధాలా మద్దతుగా ఉంటాం" అని ట్రంప్ తన సోషల్ మీడియా హ్యాండిల్ ట్రూత్‌సోషల్‌లో పేర్కొన్నారు. ఈ దాడిని దారుణ నేరంగా పుతిన్ అభివర్ణించారు.

**పెళ్లయిన 6 రోజులకే నూరేళ్లు నిండాయి**

**కాల్పుల్లో భర్తను కోల్పోయిన నవవధువు**

పెళ్లయి కాళ్లకు పారాణి ఆరకముందే ఆ నవవధువు జీవితం తలకిందులైంది. భర్తను ఉగ్రవాదులు పొట్టనపెట్టుకోవడంతో ఆ నవవధువు తన భర్త మృతదేహాన్ని పట్టుకుని దిక్కులు పిక్కటిల్లేలా ఏడ్చింది. ఈ యువజంట ఏ రాష్ట్రానికి చెందిన వాళ్లు అనే వివరాలు ఇంకా తెలియరాలేదు. "మాకు పెళ్లయి కేవలం ఆరు రోజులే అవుతోంది. ఘటన జరిగినప్పుడు మేమిద్దరం పానీపూరీని ఆస్వాదిస్తున్నాం. హఠాత్తుగా ఒక ఉగ్రవాది మా వద్దకు వచ్చాడు. నీ భర్త ముస్లింకాదుకదా అని అన్నాడు. వెంటనే ఆయన తలకు తుపాకీ గురిపెట్టి కాల్చి వెళ్లిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న నా భర్తను ఎవరైనా కాపాడండి"అంటూ ఆ మహిళ ఏడుస్తున్న హృదయ విదారక వీడియో దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతున్నాయి.

# నేడే హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

కోసం లైబ్రరీ హాల్‌లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన దృష్ట్యా.. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అందుకే కేంద్ర కార్యాలయ ఉద్యోగులకు సెలవు ఇచ్చామని పేర్కొన్నారు. దీనికి బదులుగా జూన్ 14 రెండో శనివారం పని దినంగా పరిగణిస్తామని ప్రకటించారు. మంగళవారం జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఈఆర్వో) మంగతాయారుతో కలిసి ఎన్నికల ఏర్పాట్లను అనురాగ్ జయంతి వివరించారు. పోలింగ్‌లో మొదటి ప్రాధాన్య ఓటు వేస్తేనే ఆ ఓటు చెల్లుబాటవుతుందని తెలిపారు. పోలైన ఓట్లలో 50 శాతం కంటే ఒక ఓటు ఎక్కువ పొందినవారు విజేతగా నిలుస్తారని చెప్పారు. 25 ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. బీజేపీకి ఓటు వేయకుంటే హిందువులు మిమ్మల్ని క్షమించరంటూ ఓటర్లనుద్దేశించి పలు ప్రాంతాల్లో అంటించిన పోస్టర్లను తొలగించామని రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. ఈ విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు పోలీసస్టేషన్లలో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఓటు వేయొద్దని, విప్ జారీ చేస్తామని, ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని కేటీఆర్ అనడం, హిందుత్వవాదులంతా బీజేపీకి ఓటు వేయాలని కేంద్రమంత్రి బండి సంజయ్ అనడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు రాదా? అని విలేకరులు ప్రశ్నించగా.. ఆయా విషయాల్లో చట్ట ప్రకారం వ్యవహరిస్తామని ఆయన సమాధానమిచ్చారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అందరూ వినియోగించుకోవాలని సెక్షన్ 123 చెబుతుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనవద్దంటూ బీఆర్ఎస్ తన కార్పొరేటర్లకు ఆదేశాలు జారీ చేయడంపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి మంగళవారం ఈసీ కార్యాలయానికి లేఖ రాశారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఓటింగ్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు పాల్గొనవద్దంటూ ఆ పార్టీ అధిష్ఠానం ఆదేశించిన నేపథ్యంలో పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. ఈ ఎమ్మెల్సీ స్థానం పరిధిలోని మొత్తం 112 ఓట్లకుగాను ఎంఐఎంకు 50, బీజేపీకి 24, బీఆర్ఎసకు 24, కాంగ్రెసకు 14 మంది ఓటర్లు ఉన్నారు. అయితే పోటీకి దూరంగా ఉన్న కాంగ్రెస్ తమ ఓటర్ల విషయంలో ఇప్పటికీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. బరిలో ఎంఐఎం, బీజేపీ మాత్రమే ఉండగా.. గెలుపు కోసం రెండు పార్టీలూ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఓటర్ల బలం ఎక్కువగా ఉన్నా.. తమ ప్రజాప్రతినిధులు కట్టు తప్పకుండా ఎంఐఎం కట్టడి చేస్తోంది. మరోవైపు ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకునేందుకు బీజేపీ పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా పలు ఆఫర్లు ఇస్తున్నట్టు తెలిసింది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తామని కొందరు బీఆర్ఎస్ ఓటర్లకు హామీ ఇస్తున్నట్టు సమాచారం. దీంతో వారు పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఓటింగ్‌కు దూరంగా ఉంటారా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది.



### సౌదీ నుంచి హుటాహుటిన

# ప్రధాని వెనక్కి

**పహల్గాం దాడి క్రూరమైనది: ద్రౌపదీ ముర్ము**

**భారత్‌కు మా సంపూర్ణ మద్దతు: ట్రంప్**

**ఉగ్రవాదంపై సమష్టిగా పోరాడదాం: ఖర్గే**

**కేంద్రం డొల్ల ప్రకటనలు కట్టిపెట్టాలి: రాహుల్**

**ఉగ్రమూకలపై కఠినంగా వ్యవహరించాలి: రేవంత్**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: పహల్గామ్‌లో ఉగ్రదాడిని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, వివిధ పార్టీల నాయకులు తీవ్రంగా ఖండించారు. అమాయకులైన పౌరులు, పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అత్యంత హేయమని 'ఎక్స్' వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. 'పహల్గాం ఉగ్రదాడి దిగ్భ్రాంతికరం. ఇదొక క్రూరమైన, అమానవీయ చర్య. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం భయానకం. ఇది క్షమించరానిది. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాన'ని రాష్ట్రపతి పేర్కొన్నారు. అత్యంత హేయమైన ఉగ్రదాడి వెనుక ఉన్నవారిని చట్టం ముందుకు తీసుకొస్తామని, వారిని వదిలిపెట్టబోమని ప్రధాని స్పష్టం చేశారు. ఉగ్రమూకల దుష్ట ఎజెండా ఎప్పటికీ విజయవంతం కాదని, ఉగ్రవాదంపై పోరా డాలనే తమ సంకల్పం మరింతగా బలపడుతుందని పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటనకు సౌదీ అరేబియా వెళ్లిన ప్రధాని.. ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో పర్యటనను కుదించుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మంగళవారం రాత్రి సౌదీ ప్రభుత్వ అధికారిక విందులోనూ మోదీ పాల్గొనలేదు.

# ఏపీ నుంచి రాజ్యసభకు అన్నామలై

చెన్నై/న్యూఢిల్లీ, :వైసీపీ మాజీ నేత విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి తమ పార్టీ తరపున అభ్యర్థిని నిలట్టాలని బీజేపీ భావిస్తోంది. ఇదే విషయాన్ని మంగళవారం ఢిల్లీలో తనను కలసిన సీఎం చంద్రబాబుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పినట్టు తెలిసింది. బీజేపీ అభ్యర్థికి మద్దతు తెలిపేందుకు చంద్రబాబు కూడా సుముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం. కాగా, విజయసాయిరెడ్డి స్థానంలో బీజేపీ ఎవరిని ప్రతిపాదిస్తుందన్న విషయంపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. తమిళనాడు బీజేపీ అధ్యక్ష పదవికి ఇటీవల రాజీనామా చేసిన అన్నామలైకు రాజ్యసభ సీటు ఇచ్చే అవకాశాలు ఉన్నట్టు చర్చ జరుగుతోంది. త్వరలో జరిగే కేంద్ర మంత్రివర్గ విస్తరణలో ఆయన్ను మంత్రివర్గంలోకి కూడా తీసుకుంటారని భోగట్టా. మరోవైపు మాదిగ దండోరా నేత మందకృష్ణ మాదిగకు అవకాశం కల్పించే అంశంపైనా చర్చ జరిగినట్టు తెలిసింది. ఢిల్లీలోనే ఉన్న మందకృష్ణ మాదిగ... మంగళవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో వెళ్లి అమిత్ షాను, చంద్రబాబును కలుసుకున్నారు. అలాగే కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ పేరు కూడా బీజేపీ వర్గాల్లో ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. ఏదేమైనా ఆ సీటన్ను మళ్లీ విజయసాయి రెడ్డికే కేటాయిస్తారంటూ వచ్చిన ప్రచారంలో వాస్తవం లేదని అటు బీజేపీ, ఇటు టీడీపీ వర్గాలు ధ్రువీకరించాయి.

# ఇంటర్ ఫలితాల్లో అమ్మాయిల హవా..



57.31 ఉంటే, బాలికల ఉత్తీర్ణత శాతం దాదాపుగా ఫస్టియర్ మాదిరే 74.21 శాతం నమోదైంది. మొత్తంగా (రెండేళ్ళు కలిపి) ఈ ఏడాది ఇంటర్ ఉత్తీర్ణత 65.81గా నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే ఇది దాదాపు 5%ఎక్కువ.

**ఆసిఫాబాద్‌లో అత్యధిక శాతం ఉత్తీర్ణత**

మార్చి 5 నుంచి 25వ తేదీల మధ్య ఇంటర్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల ఫలితాలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంగళవారం ఇంటర్ బోర్డు కార్యాలయంలో విడుదల చేశారు. ఇంటర్ పరీక్షలకు రెండు సంవత్సరాలకు కలిపి 9,97,012 మంది హాజరయ్యారని, వీరిలో 6,56,099 మంది పాసయ్యారని భట్టి తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మొదటి, రెండో సంవత్సరం ఫలితాల్లో అత్యధిక శాతం ఉత్తీర్ణత నమోదు చేసిందని తెలిపారు. కాగా ఫస్టియర్‌లో మహబూబాబాద్, సెకెండియర్‌లో కామారెడ్డి అతితక్కువ ఉత్తీర్ణత నమోదు చేశాయని ఆయన వివరించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగిరాణా, సీజీజీ డీజీ రాజేంద్ర నిమ్జే, ప్రత్యేక కార్యదర్శి హరిత, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరీక్ష విభాగం ముఖ్య అధికారి జయప్రదాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

**మే 22 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ**

ఇంటర్మీడియెట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు మే 22 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. జూన్ 3 నుంచి ఆరు వరకూ ప్రాక్టికల్స్ ఉంటాయని చెప్పారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి ఈ నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పరీక్షా ఫలితాలకు సంబంధించి రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోరుకునే విద్యార్థులు ఈ నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### సమష్టితత్వంతో ఏదైనా సాధ్యమని

# హిరోషిమా చాటింది

పలువురు వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలతో సమావేశమైంది. తొలుత హిరోషిమా ప్రిఫెక్చురల్ (రాష్ట్ర ప్రభుత్వం) అసెంబ్లీకి రేవంత్ బృందం విచ్చేయగా వారికి స్పీకర్ తకాషి నకమోటో, శాసనసభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ 'శాంతి, స్థిరత్వం, సమృద్ధి లాంటి విలువలను పంచుకుందాం. పెట్టుబడులకు పరస్పర సహకారం, భాగస్వామ్యం గురించి మాట్లాడటానికి వచ్చాం. కలసికట్టుగా మెరుగైన, పచ్చని, సమగ్రమైన ప్రపంచాన్ని నిర్మిద్దాం'అని అక్కడి ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే 50కిపైగా జపాన్ కంపెనీలు తెలంగాణలో పనిచేస్తున్నాయని.. మరిన్ని కంపెనీలను ఏర్పాటు చేయాలని అక్కడి పారిశ్రామికవేత్తలను కోరారు. తెలంగాణను సందర్శించి రాష్ట్ర ప్రగతిని స్వయంగా చూడాలని హిరోషిమా ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. అలాగే హిరోషిమా డిప్యూటీ గవర్నర్‌తో సీఎం రేవంత్ సమావేశమయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఆ తర్వాత హిరోషిమా చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులతో సీఎం సమావేశమయ్యారు. అనంతరం హిరోషిమా పీస్ మెమోరియల్ పార్క్, అణుబాంబు డోమ్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు నివాళులర్పించారు. ఆపై అక్కడి గాంధీ మెమోరియల్ వద్ద పుష్పాంజలి ఘటించారు. జపాన్ పర్యటన ముగించుకున్న సీఎం రేవంత్ బుధవారం హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు.

**పెట్టుబడులు రూ. 12,062 కోట్లు.. 30,500 ఉద్యోగాలు**

జపాన్ పర్యటనలో రూ. 12,062 కోట్ల పెట్టుబడులు, 30,500 ఉద్యోగాల సృష్టికి ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఇందులో అత్యధికంగా ఎన్‌టీటీ డేటా%-%నెయిసా నెట్‌వర్క్స్ హైదరాబాద్‌లో రూ. 10,500 కోట్ల పెట్టుబడితో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకుందని పేర్కొంది. అలాగే మారుబెని కంపెనీ రూ. వెయ్యి కోట్ల ప్రారంభ పెట్టుబడి ద్వారా హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్‌ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుందని.. మొత్తంగా రూ. 5,000 కోట్ల పెట్టుబడుల అంచనాతో 30 వేల ఉద్యోగాల కల్పనకు ముందుకొచ్చిందని ప్రభుత్వం వెల్లడించింది. తోషిబా అనుబంధ కంపెనీ టీటీడీఐ హైదరాబాద్ శివార్లలో మూడో విద్యుత్ పరికరాల ప్లాంట్ ఏర్పాటు కోసం రూ. 562 కోట్ల పెట్టుబడి పెట్టేలా ఒప్పందం కుదుర్చుకుందని వివరించింది. టామ్‌కాతో కుదిరిన ఒప్పందం ద్వారా 500 ఉద్యోగాలకు ఒప్పందం కుదర్చుకున్నట్లు ప్రభుత్వం చెప్పింది.

### 'భూ భారతి'ని దుర్వినియోగం చేస్తే

# ఉపేక్షించం: మంత్రి పొంగులేటి

'భూ భారతి' చట్టాన్ని ఎవరు దుర్వినియోగం చేసినా ఉపేక్షించేది లేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో మంగళవారం ఏర్పాటు చేసిన భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు, స్థానిక ఎంఎల్ఎ కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ%ఔ%తమ ప్రభుత్వం రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం భూ భారతి చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిందని అన్నారు. రైతు లేనిదే.. రాజ్యం లేదని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భూ సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యోచనతో ఈ చట్టం తీసుకువచ్చామని తెలిపారు. గ్రామ పరిధిలో ఉండే అధికారులతోనే ఈ చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పారదర్శకంగా ఈ చట్టాన్ని రూపొందించినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం చేసిన ధరణి వల్ల రైతులు అనేక కష్టాలు ఎదుర్కొన్నారని, భూ వివాదాలు పెరిగాయే కానీ తగ్గలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం ద్వారా రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. స్థానిక ఎంఎల్ఎ కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రభుత్వం నడుస్తోందని, ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి మంచి కార్యక్రమాలు జరగలేదన్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ అవగాహన సదస్సుకు చుట్టుపక్కల గ్రామాల రైతులు భారీగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎంఎల్ఎ వేముల వీరేశం, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్‌డిఓ శేఖర్ రెడ్డి, డిఆర్‌డిఓ నాగిరెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపిడిఓ జితేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బీమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్‌బాబుకు ఈడీ సమన్లు



హైదరాబాద్: సాయిసూర్య డెవలపర్స్, సురానా గ్రూప్ ఆఫ్ కంపెనీల మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ సంస్థలకు ప్రచారకర్తగా పనిచేసిన ప్రముఖ సినీ నటుడు మహేశ్‌బాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీచేసింది. సాయిసూర్య డెవలపర్స్ కంపెనీ నుంచి మహేశ్‌బాబుకు రూ.5.9 కోట్లు చెల్లించినట్టు ఈడీ అధికారులు ఆధారాలు సేకరించారు. దీంతో ఈ నెల 28న బషీర్‌బాగ్‌లోని ఈడీ ఆఫీసులో హాజరుకావాలని సోమవారం సమన్లు జారీచేశారు. సురానా గ్రూప్ ఆఫ్ కంపెనీలైన సాయిసూర్య డెవలపర్స్, భాగ్యనగర్ ప్రాపర్టీస్ సంస్థల్లో ఈ నెల 16న ఈడీ సోదాలు చేసిన విషయం తెలిసిందే. ఈ సోదాల్లో రూ.100 కోట్ల అక్రమ లావాదేవీలకు సంబంధించిన కీలక పత్రాలను ఈడీ గుర్తించింది. రూ.74.5 లక్షలు నగదు సీజ్ చేసింది. మహేశ్‌బాబుకు చెక్కుల రూపంలో రూ.3.4 కోట్లు, నగదు రూపంలో రూ.2.5 కోట్లు చెల్లించినట్లు ఈ సోదాల్లో ఆధారాలు లభించాయి. దీంతో ఆయనకు ఈడీ అధికారులు సమన్లు జారీ చేశారు. విచారణకు వచ్చే సమయంలో పాన్‌కార్డ్, బ్యాంక్ అకౌంట్లకు సంబంధించిన పాస్‌బుక్స్‌ను తీసుకురావాలని సూచించారు.

**ఇదీ కేసు నేపథ్యం**

సాయితులసి ఎన్‌క్లేవ్, షణ్ముఖ నివాస్‌లో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో బాధితులు నవంబర్‌లో ఈ సంస్థలపై సైబరాబాద్ ఈవోడబ్ల్యూకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు 11 కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో సాయిసూర్య డెవలపర్స్ ప్రొప్రైటర్ కె. సతీష్‌చంద్ర గుప్తా, భాగ్యనగర్ ప్రాపర్టీస్ ప్రమోటర్ నరేంద్ర సురానాను నవంబర్‌లోనే అరెస్ట్ చేశారు. గ్రీన్ మెడోస్ ప్రాజెక్ట్ పేరుతో మోసాలకు పాల్పడినట్లు సతీష్‌చంద్ర గుప్తాపై సిటీ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లోనూ గతేడాది కేసు నమోదైంది. ఈ ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ అధికారులు మనీలాండరింగ్ కోణంలో ఈసీఐఆర్ నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. సాయిసూర్య డెవలపర్స్, భాగ్యనగర్ ప్రాపర్టీస్ సంస్థలు రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో సాయితులసి ఎన్‌క్లేవ్, షణ్ముఖ నివాస్ పేరుతో వెంచర్లు వేశాయి. సాయిసూర్య డెవలపర్స్ ఒక్కో ప్లాట్‌కు రూ.3.25 కోట్ల చొప్పున కొనుగోలుదారులతో ఒప్పందాలు చేసుకుని, అడ్వాన్స్‌గా రూ.1.45 కోట్ల చొప్పున వసూలు చేసింది. అయితే, ఒకరికి విక్రయించిన ప్లాట్‌ను మరికొందరి పేర్లపై రిజిస్టర్ చేసి వందల కోట్ల రూపాయల మోసానికి పాల్పడిందని ఆరోపణలు ఉన్నాయి. ఇలా సంపాదించిన డబ్బును ఇతర సంస్థలకు మళ్లించింది. ఈ క్రమంలోనే నటుడు మహేశ్‌బాబుకు రూ.5.9 కోట్లు సాయిసూర్య డెవలపర్స్ నుంచి చెల్లించినట్లు ఈడీ గుర్తించింది. దీనిపై మరింత సమాచారం సేకరించేందుకు ఆయనకు సమన్లు జారీచేశారు.

# సంపాదకీయం

## నారాయణబాబు కవిత్వ ఆల్కెమీ

"కవిత్వం ఒక ఆల్కెమీ, దాని రహస్యం కవికే తెలుసును" అని దేవరకొండ బాల గంగాధర తిలక్ ప్రకటిస్తూ ఓ నలుగురు కవుల పేర్లు ఇచ్చాడు. కానీ కవిత్వాన్ని ఆల్కెమీ (రసచర్య) చేయగల తెలుగుకవి శ్రీరంగం నారాయణబాబు..."కవిత్వం ఒక ఆల్కెమీ, దాని రహస్యం కవికే తెలుసును" అని దేవరకొండ బాల గంగాధర తిలక్ ప్రకటిస్తూ ఓ నలుగురు కవుల పేర్లు ఇచ్చాడు. కానీ కవిత్వాన్ని ఆల్కెమీ (రసచర్య) చేయగల తెలుగుకవి శ్రీరంగం నారాయణబాబు మాత్రమే! తన కాలం నాటి భావకవులు రాత్రి ఆకాశాన్ని పూలతోటగాను, నక్షత్రాలను పూలుగాను వర్ణన చేశారు. నారాయణబాబు "నల్లని త్రాచుకోరలు/ తెల్లని మశూచి కుండలు/ గగనమ్మున చుక్కలు" అని రాయగలిగాడు. తానూ, శ్రీశ్రీ తొలినాళ్లలో భావకవిత్వాన్ని రాశామని, అనంతర కాలంలో దానిని తామే విసిరికొట్టామని నారాయణబాబు అన్నాడు. పురిపండా అన్నట్లు "తొలిదినాల్లో నారాయణబాబు అచ్చమైన భావకవి. కట్టుబడిలో, జుత్తులో, వేషంలో కూడా!" కవిత్వంపై నారాయణబాబు తన అభిప్రాయాన్ని ఇలా ప్రకటించాడు: "కవిత్వమంటే అతి మృదులమైనదీ, బహుసరళమైనదీ, మందుగుండులాంటిదీ. జాగ్రత్త! ఖబడ్దార్! సాంద్రతరమైన నిబిడమైన భాషావిపిన విటపీ వీథుల గంభీరత కాదుబీ గుబురులు గుబురులుగా గుమిగూడిన పాదపశ్యామల పత్రాళిలో అలముకొంటున్న నీరవ నీరంధ్ర భయదాంధకార జీమూతాళి!"

1930–50 సంవత్సరాల నడుమ నారాయణబాబు రాసిన నలభై కవితల్ని ఆరుద్ర 1972లో 'రుధిరజ్యోతి' కవితా సంపుటిగా ముద్రించాడు. 47 ఏళ్ళ తరువాత 2019లో ఈ పుస్తకాన్ని విజయనగరం నుండి ఎన్. కె. బాబు పునర్ముద్రించాడు.'కపాలమోక్షం' కవితలో శివుని తపస్సును ఉగ్రంగా, స్వభావసిద్ధంగా వర్ణిస్తాడు నారాయణబాబు. మునులూ, ప్రాణులూ శివుడిని తపస్సు వీడమని ప్రార్థిస్తారు. కళ్ళు తెరిచేసరికి చేతి లోని బ్రహ్మకపాలం నశించిపోతుంది. భిక్షాపాత్రగా కపాలం కావాలని "పటపట పళ్ళు కొరికినాడు" శివుడు. "తురకల గోరీలందున/ క్రైస్తవుల సమాధులందున/ హిందూ శ్మశానవాటుల/ కపాలములు వికవిక నవ్వినవి" అంటాడు. ఔను! మతం మానవులకే గాని, కపాలాలకు లేదు కదా! అదే సమయంలో భగత్ సింగ్‌ను ఉరితీస్తారు. "భారతవీరుని/ కపాల మొక్కటి/ కపర్ది చేతిని/ రివ్వున వాలింది" అని రాస్తాడు నారాయణబాబు, భగత్ సింగ్ పేరు చెప్పకుండానే! శివుని కంటి మంటకు చేతిలోని బ్రహ్మకపాలం నశిస్తే దాని స్థానంలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ పుఱ్ఱె చేరిందట. దేశభక్తుని పుఱ్ఱె బ్రహ్మకపాలం కంటే గొప్పదని ధ్వనిస్తోంది కదూ! పౌరాణిక ఇతివృత్తాన్ని నేరుగా తీసుకొని, ఆధునిక సంఘటనకు ముడిపెట్టి గొప్ప ఫలితాన్ని సాధిస్తాడు. ఈ కవిత చదివిన రోణంకి అప్పలస్వామి "నారాయణబాబు కవనం మన్ను నుంచి మానవులను సృష్టిస్తుంది," అన్నాడు. "వెయ్యేళ్ళ తెలుగు కవితా భవనానికి నారాయణబాబు ఈ 'కపాలమోక్షం' ద్వారా ఒక ఆధునిక కవితా గవాక్షాన్ని ఆవిష్కరించాడు" అని విశ్లేషిస్తాడు సోమసుందర్.'ఊరవతల' కవితలోని ఈ పంక్తులను చూడండి: "పోయిన ఆ యేటి నవ్వో/ పుక్కిట నెమరేసుకుంటు/ గండశిల నీడ లోన/ కనుమోడ్చెను/ గార్దభస్వామి" %–% ఇక్కడ కవి ఎండిన సెలయేరును వర్ణిస్తున్నాడు. కెరటాల పొంగును ఏటి నవ్వుగా ఉత్ప్రేక్షించాడు. ప్రస్తుతం ఏరు ఎండిపోయింది. ఆ పొంగును గాడిద తన నోటి నురుగుగా నది గతకాలపు ఉచ్ఛ స్థితిని నెమరు వేసుకుంటుందట. "బ్రహ్మజెముడు కంచె మధ్య/ పూర్ణిమ సంధ్యల్లోన/ గడియైనా ఉదయాద్రిని/ రుధిరజ్యోతై వెలిగే జాబిల్లి/ మృతశరీర ఆక్రమణ/ ఘటాకాశ అరుణారుణ/ రక్తసిక్త మోముతోడ.. గాజుకళ్ళ పురిటి పిల్ల!" తల్లిచే పారేయబడ్డ రక్తసిక్త పురిటిపిల్లను రుధిరజ్యోతై వెలిగే జాబిల్లిగా ఊహ చేయడం నారాయణబాబుకే తెలిసిన విద్య.

"శ్రీశ్రీ కవిత ఛందస్సుల జలపాత వేగంతో ఉరకలిడి బాహ్యస్వరూపంతో పాఠకుణ్ణి లోగొంటే, నారాయణబాబు కవిత సెలయేటి మార్దవంతో పఠిత హృదయంలో చేరి అనంత భావజాలాన్ని ప్రేరేపుతుంది," అని సోమసుందర్ తీర్పునిస్తాడు."రుధిర జ్యోతిర్/ జ్వలనా లలనా/ ప్రియుండ!/ విప్లవ ఋషిని/ విద్రోహ కవిని," అని రాస్తాడు నారాయణబాబు. రుధిరజ్యోతిర్జ్వలనాన్ని లలనతోను, ఋషిని విప్లవంతోనూ సంపర్కం చేయించి, కొత్తదైన రసాయన చర్యను కలిగిస్తాడు. పాఠకుల మనసుల్లో భావాన్ని గింగిర్లు కొట్టిస్తాడు. 'విద్రోహం' అనే పదం నజ్రుల్ ఇస్లాం ప్రభావంలో నారాయణబాబు రాశాడు. 1930ల్లో బంగ్లా మహాకవి నజ్రుల్ ఇస్లాం, హరీంద్రనాథ ఛటోపాధ్యాయల ప్రభావం దేశమంతటా ప్రసరించింది. "భారతీయ సంప్రదాయం ఇతని కవితలో చక్కగా జాలు వారుతూ ఉంటుందిబీ అధివాస్తవికత ఉందంటారే గాని నారాయణబాబు సర్రియలిస్టు కాదు. చివరికి 'మౌన శంఖం' అనే ఒక్క సర్రియలిస్టు కవిత రాశాడు. అంతే!" అని రోణంకి అప్పలస్వామి చెప్పిన మాటలు అక్షరసత్యాలు. ప్రాచీన సాహిత్యంలో శ్రీకృష్ణదేవ రాయల వారి 'ఆముక్తమాల్యద' కావ్యం ఎలాంటిదో, ఆధునిక సాహిత్యంలో నారాయణ బాబు 'రుధిరజ్యోతి' అలాంటిది. "పలికితుత్ప్రేక్షోపమలు" అని కంఠోక్తిగా చెప్పుకున్న రాయలవారు ఉత్ప్రేక్షాలంకారాన్ని చాలాచోట్ల తన కావ్యంలో వాడుకున్నారు. నారాయణబాబు కూడ 'రుధిరజ్యోతి'లోని కవితల్ని గొప్ప ఊహాశాలిత్వంతో రాశారు. 'ఆముక్తమాల్యద' ఆసాంతం రసవంతంగా ఉంటుంది.

-ఎడిటర్

## ఇన్‌స్టాలో మైనర్ల ఖాతాలపై ఏఐతో నిఘా



ఇన్‌స్టాగ్రామ్ మైనర్ల ఖాతాలను గుర్తించడానికి కృత్రిమ మేధనాన్ని ఉపయోగించాలని నిర్ణయించింది. వయసును తప్పుగా చూపి అకౌంట్లు క్రియేట్ చేసిన మైనర్లపై ఎక్కువ ఆంక్షలు విధించాలని సంస్థ పేర్కొంది తప్పుడు వయసు చూపి ఇన్‌స్టాగ్రామ్ వాడుతున్న మైనర్ల ఖాతాలను కృత్రిమ మేధను ఉపయోగించి గుర్తించే ప్రయత్నం చేస్తున్నామని ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ మెటా తెలిపింది. యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకునే సమయంలో కొందరు మైనర్లు తమ వయసును ఎక్కువగా చూపుతున్నారని ఇన్‌స్టాగ్రామ్ అనుమానిస్తోంది. అలాంటి అకౌంట్లను గుర్తించడానికి క్రియాశీలకంగా వ్యవహరించాలని ఇన్‌స్టాగ్రామ్ నిర్ణయించింది. అటువంటి అకౌంట్లను గనక తాము గుర్తిస్తే, వాటిని మరిన్ని ఆంక్షలు కలిగిన మైనర్ అకౌంట్లుగా మారుస్తామని తెలిపింది. అకౌంట్ ఎప్పుడు క్రియేట్ చేశారు, అకౌంట్ ప్రొఫైల్, దానికి సంబంధించిన కంటెంట్ ఆధారంగా యూజర్ల వయసును నిర్ధారించే ప్రయత్నం చేస్తున్నామని సంస్థ తెలిపింది.

## కొత్త పోప్ ఎన్నికలో భారతీయులు.. ఆ నలుగురు ఎవరంటే..



పోప్ ఫ్రాన్సిస్ తుది శ్వాస విడిచిన క్షణం నుంచి తదుపరి పోప్ ఎవరనే ఆసక్తి ప్రపంచవ్యాప్తంగా నెలకొంది. ప్రస్తుతం పాపల్ కాన్‌క్లేవ్‌లో కొత్త పోప్‌ను ఎన్నుకోవడానికి 135 మంది కార్డినల్స్‌కు అర్హత ఉంది. వీరిలో నలుగురు భారతీయులు ఉండగా.. ఒక హైదరాబాదీ కూడా ఉన్నారు. పోప్ ఫ్రాన్సిస్ మరణించినప్పటి నుంచి వాటికన్ సిటీకి కాబోయే అధిపతి ఎవరనే ఆసక్తి ప్రపంచవ్యాప్తంగా నెలకొంది. అయితే, పోప్ అస్తమించిన నాటి నుంచి తొమ్మిది రోజుల వరకూ వాటికన్ లో సంతాప దినాలుగా పాటిస్తారు. పురాతన రోమన్ కాలం నుంచి కొనసాగుతున్న ఈ ఆచారాన్ని నోవెండియేల్ అని పిలుస్తారు. ఆ తర్వాతే నూతన పోప్ ఎన్నికకు సన్నాహాలు మొదలవుతాయి. ఎన్నిక రోజున కాన్‌క్లేవ్‌లో అర్హత పొందిన కార్డినల్స్ రహస్య ఓటింగ్ విధానంలో తదుపరి పోప్ ను ఎంపిక చేస్తారు.ఇప్పటికే ప్రపంచంలోని నలుమూలల నుంచి పోప్ అంత్యక్రియల కోసం కార్డినల్స్ వాటికన్ సిటీకి చేరుకుంటున్నారు. అయితే, పాపల్ కాన్‌క్లేవ్‌లో ఓటు వేయడానికి ప్రస్తుతం అర్హత 135 మంది కార్డినల్స్‌కు అర్హత ఉంది. వీరిలో నలుగురు భారతీయులు కార్డినల్ ఫిలిప్ నెరి ఫెర్రావ్, కార్డినల్ బసేలియోస్ క్లీమిస్, కార్డినల్ ఆంథోనీ పూల, కార్డినల్ జార్జ్ జాకబ్ కూవకాడ్ ఉన్నారు. వాటికన్ సిటీ అధిపతి, 135 కోట్ల క్యాథలిక్కులకు నాయకుడిని ఎంపిక చేయడంలో కీలకంగా వ్యవహరించనున్నారు.ఆ నలుగురు ఎవరు..కార్డినల్ జార్జ్ జాకబ్ కూవకాడ్ (51), కార్డినల్ డీకన్ కాగా, కార్డినల్ ఫిలిప్ నేరి ఆంటోనియో సెబాస్టియావో డో రోసారియో ఫెర్రావ్(72) గోవా, డామన్ (భారతదేశం) మెట్రోపాలిటన్ ఆర్చ్ బిషప్, భారత కాథలిక్ బిషప్‌ల కాన్ఫరెన్స్, ఆసియా బిషప్‌ల సమావేశాల సమాఖ్యకు అధ్యక్షుడు. కార్డినల్ ఆంథోనీ పూల (63) హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఆర్చ్ బిషప్. కార్డినల్ బాసేలియోస్ క్లీమిస్ తొట్టుంకల్ సైరో–మలంకర (భారతదేశం) త్రివేండ్రం మేజర్ ఆర్చ్ బిషప్, సైరో–మలంకర చర్చి సైనాడ్ అధ్యక్షుడు.పోప్ రేసులో..ఏప్రిల్ 19 నాటికి 252 మంది కార్డినల్స్ ఉండగా కేవలం 80 ఏళ్లలోపు వారికే కొత్త పోప్‌ను ఎన్నుకునే సమావేశంలో ఓటు వేయడానికి అర్హులు. అలా చూస్తే ప్రస్తుతం 135 మంది ఓటు వేసే అర్హత ఉంది. నిబంధనల ప్రకారం వీరిలో కూడా 120 మందికే ఓటు వేసే హక్కు ఉంటుంది. శతాబ్దాలుగా పాటిస్తున్న సంప్రదాయం ప్రకారం ఈ సారి కార్డనల్లలో ఒకరిగా పోప్ గా ఎన్నుకుంటారు. ఓటింగ్ రోజున సిస్టీన్ చాపెల్ చిమ్నీ నుంచి నల్లటి పొగ వస్తే ఇంకా ఎంపిక పూర్తికాలేదని.. తెల్లటి పొగ వస్తే కొత్త పోప్ ఎన్నిక పూర్తయిందని అర్థం. ప్రస్తుతం పోప్ రేసులో ప్రధాన పోటీదారు పియట్రో పరోలిన్ (70), కాగా తర్వాతి స్థానంలో రాబర్ట్ ప్రివోస్ట్ (69) ఉన్నారు. పీటర్ ఎర్డో (72), మార్క్ ఓలెట్ (80), రీన్‌హార్డ్ మార్క్స్ (71), క్రిస్టోఫ్ షోన్‌బోర్న్ (80), మ్యాటియో జుప్పీ (69), లూయిా ట్యాగిల్ (67) పోప్ పదవికి పోటీపడబోతున్నారు.

## కృత్రిమ మేధతో ఉద్యోగాల ఊచకోత



కృత్రిమ మేధ (ఏఐ) వల్ల ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఉద్యోగాలు పోవనున్నాయి. బిల్‌గేట్స్, ఒబామా ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ, ఏఐ భవిష్యత్తులో అనేక సమస్యలను పరిష్కరిస్తుందని వారు తెలిపారు.స్మార్ట్‌ఫోన్ల ద్వారా సామాన్యుల చేతుల్లోకి సైతం వచ్చేసిన కృత్రిమ మేధ (ఏఐ) దెబ్బకు.. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఉద్యోగాలు పోతాయని మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు బిల్‌గేట్స్, అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా ఆందోళన వ్యక్తం చేశారు.


ఆ సంక్షోభం ఏ స్థాయిలో ఉంటుందంటే.. గత వందేళ్లలో ఎప్పుడూ చూడనంత భారీగా ఉంటుందని వారు వేర్వేరు వేదికలపై నుంచి హెచ్చరించారు. సమీప భవిష్యత్తులో వైద్యసేవలు, బోధన వంటివి కూడా ఏఐ ద్వారా సామాన్యులకు ఉచితంగా అందుబాటులోకి వస్తాయని బిల్‌గేట్స్ జోస్యం చెప్పారు. రానున్న కాలంలో అనేక సమస్యలను కృత్రిమ మేధ పరిష్కరిస్తుందని, నవకల్పనలకు ఊతమిస్తుందని పేర్కొన్న ఆయన.. ఏఐ కారణంగా భవిష్యత్తులో ఏం జరగొచ్చో కచ్చితంగా చెప్పలేని అనిశ్చితి ఉందని, అదే చాలా భయం కలిగిస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. ఇక.. గతంలో ఏ సాంకేతిక పరిజ్ఞానం వల్ల వచ్చిన మార్పులూ చూపనంత ప్రభావాన్ని ఏఐ చూపనుందని ఒబామా అన్నారు. ఏఐ ఆధారిత ఆటోమేషన్ వేగం పుంజుకుని, అన్ని రంగాల్లోనూ ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం పడుతుందని.. దీంతో ప్రజలు తమ జీవనోపాధి గురించి వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆందోళన వెలిబుచ్చారు.ఉదాహరణకు.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏఐ మోడళ్లు 60–70న్న మంది సాఫ్ట్‌వేర్ డెవలపర్ల కన్నా మిన్నగా కోడింగ్ చేయగలుగుతున్నాయని, త్వరలో వారి పని చాలావరకూ కృత్రిమమేధ పరమవుతుందని ఆయన హెచ్చరించారు. తమ పనితీరును మెరుగుపరచు కోవడానికి ఏఐను వాడే అత్యున్నతస్థాయి నైపుణ్యం కలిగిన వారి ఉద్యోగాలు తప్ప.. మిగతావారి ఉద్యోగాలు పోతాయని పేర్కొన్నారు. మరోవైపు, భారతదేశంలో మధ్యతరగతి వర్గానికి ఇన్నాళ్లుగా వెన్నెముకగా నిలిచిన వైట్ కాలర్ ఉద్యోగాల సంఖ్య భారీగా తగ్గిపోతోందని ప్రముఖ ఇన్వెస్టమెంట్ స్ట్రాటజిస్ట్ సౌరభ్ ముఖర్జియా హెచ్చరించారు. పెరుగుతున్న ఆటోమేషన్, కృత్రిమ మేధ వంటివాటి కారణంగా సంప్రదాయ ఉద్యోగావకాశాలకు క్రమేపీ కోత పడుతోందని 'బియాండ్ పేచెక్: ఇండియాస్ ఆంత్రప్రెనరల్ రీబర్త్' పేరిట నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో ఆయన వ్యాఖ్యానించారు. వైట్ కాలర్ ఉద్యోగాలు ఎక్కువగా ఉండే ఐటీ, మీడియా, ఫైనాన్స్ రంగాల గురించి ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. తమ కోడింగ్ అవసరాల్లో 33% మేర కృత్రిమ మేధ తీరుస్తోందన్న గూగుల్ ప్రకటనను ఉటంకించారు. భారతీయ టెక్ కంపెనీల్లోనూ త్వరలో అదే ట్రెండ్ మొదలవుతుందని సౌరభ్ అంచనా వేశారు.

## భారీ ప్రమాదం.. మంటల్లో కాలిపోయిన విమానం.. వీడియో వైరల్..



అమెరికాలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. టేకాఫ్ అవుతుండగా విమానంలో మంటలు చెలరేగుతున్న దృశ్యాలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. అమెరికాలోని ఓర్లాండో విమానాశ్రయంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వందల మంది ప్రయాణిస్తున్న డెల్టా ఎయిర్‌లైన్స్ విమానం టేకాఫ్ అయ్యేటప్పుడు హఠాత్తుగా భారీ ఎత్తున మంటలు చెలరేగాయి.విమానం కుడి ఇంజిన్‌లో మంటలు చెలరేగి నల్లటి పొగ బయటికి ఎగసిపడుతున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓర్లాండో నుంచి అట్లాంటాకు బయలుదేరడానికి సిద్ధమవుతుండగా మంటలు చెలరేగినట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు.అమెరికా దేశం ఫ్లోరిడా రాష్ట్రంలోని ఓర్లాండో విమానాశ్రయంలో డెల్టా ఎయిర్‌లైన్స్ %ూా%330 మంటల్లో చిక్కుకుంది. సోమవారం తెల్లవారుజామున 282 మంది ప్రయాణికులు, 10 మంది విమాన సిబ్బంది, ఇద్దరు పైలట్లతో ఓర్లాండో నుండి అట్లాంటాకు బయలుదేరడానికి సిద్ధమవుతున్న విమానం ఇంజన్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో ఎయిర్‌క్రాఫ్ట్ రెస్క్యూ %ꣳ% ఫైర్ ఫైటింగ్ బృందం వెంటనే రంగంలోకి దిగి అత్యవసర స్లయిడ్‌ల ద్వారా ప్రయాణీకులు, సిబ్బందిని బయటకు తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని, ప్రాణ నష్టం జరగలేదని డెల్టా ఎయిర్‌లైన్స్ తెలిపింది. విమానం గాల్లోకి లేవకముందే మంటలు చెలరేగడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని విమానాశ్రయ అధికారులు తెలిపారు.ప్రమాదం అనంతరం ఓర్లాండో అంతర్జాతీయ విమానాశ్రయం సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. "ఈరోజు ఉదయం 11:06 గంటలకు డెల్టా ఎయిర్ లైన్స్ విమానం 1213 బయలుదేరే ముందు ర్యాంప్ ప్రాంతంలో ఉండగా ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. ఎయిర్‌క్రాఫ్ట్ రెస్క్యూ %ꣳ% ఫైర్ ఫైటింగ్ బృందం వెంటనే స్పందించి ప్రయాణీకులను ఖాళీ చేయించారు. విచారణ కోసం దయచేసి డెల్టా ఎయిర్ లైన్స్‌ను నేరుగా సంప్రదించండి." అని పేర్కొంది. కస్టమర్లకు అసౌకర్యం కలిగినా సహకరించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ.. వీలైనంత త్వరగా వారిని గమ్యస్థానాలకు చేర్చేందుకు కృషి చేస్తామని డెల్టా ఎయిర్‌లైన్స్ ఒక ప్రకటనలో తెలిపింది.

## ఉక్రెయిన్‌తో చర్చలకు సిద్ధం



ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు తాను సిద్ధమని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. ఈస్టర్ సందర్భంగా కాల్పుల విరమణతో పాటు, మరిన్ని చర్చలకూ తాము సిద్ధమని తెలిపారు. ఉక్రెయిన్‌తో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు సహకరించాలంటూ అమెరికా.. రష్యాపై ఒత్తిడి చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌తో చర్చలు జరిపేందుకు తాను సిద్ధమని సోమవారం పుతిన్ చెప్పారు. అనేక సంవత్సరాల తర్వాత ఆయన ఇలాంటి ప్రకటన చేయడం ఇదే తొలిసారి. ఇక ఈస్టర్ సందర్భంగా రష్యా ఒక రోజు కాల్పుల విరమణను పాటించిన సంగతి తెలిసిందే. ఇలాంటి కాల్పుల విరమణలు మరిన్ని పాటిచేందుకు కూడా సిద్ధమని పుతిన్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ నుంచి కూడా అదే ఆశిస్తున్నామని తెలిపారు. పుతిన్ వ్యాఖ్యలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇంకా స్పందించలేదు.


# అంబర్ చెరువులో నూతన డ్రైనేజ్ పైప్ లైన్ వేయాలి

-మంత్రిని కోరిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల:**
ప్రగతి నగర్ అంబర్ చెరువులో నూతన డ్రైనేజ్ పైప్ లైన్ ఏర్పాటు కొరకు కృషి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కోరారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ప్రగతి నగర్ ప్రజల విన్నపం మేరకు అంబర్ చెరువు కలుషితం కాకుండా నూతన డ్రైనేజ్ పైప్ లైన్ ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వినతిపత్రాన్ని స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ప్రగతి నగర్ మాజీ కార్పొరేటర్ ఇంద్రాజిత్ రెడ్డి, నిజాంపేట్ మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

## తన 3నెలల గౌరవ వేతనాన్ని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ కి అందజేసిన ఎమెల్సీ శంభీపూర్ రాజు



**కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల:**
ఈనెల 27న వరంగల్ లో జరగబోయే రజతోత్సవ సిల్వర్ జూబ్లీ బహిరంగ సభ, బీఆర్ఎస్ 25 ఏళ్ల పండుగ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడిగా, కేసీఆర్ అడుగుజాడల్లో నడిచిన సైనికుడిగా తన మూడు నెలల గౌరవ వేతనాన్ని (%=o%.6,00,000/-) సంబంధించిన చెక్కును బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి అందజేశారు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమెల్సీ శంభీపూర్ రాజు .


## రజోత్సవ వేడుకలను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

- బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్





**కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల:**
పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జీడిమెట్ల డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు సమావేశమై ఈనెల 27న వరంగల్ లో నిర్వహించనున్న బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ మాట్లాడుతూ... నీళ్లు, నిధులు, నియామకాలలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న వివక్షతపై స్వరాష్ట్ర సాధన ద్వారానే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని భావించి కొట్లాడి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని అనతి కాలంలోనే అన్ని రంగాలలో అగ్రపథాన నిలిపిన మహోన్నత శక్తి, మన నాయకులు కేసీఆర్ అని అన్నారు. ఇంతటి ఘనచరిత్ర కలిగిన బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలను జయప్రదం చేయాల్సిన బాధ్యత ప్రతీ నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. రజతోత్సవ వేడుకలకు భారీ సంఖ్యలో బయల్దేరి వెళ్ళి మన ఐకమత్యాన్ని, క్రమశిక్షణను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రోడా మేస్త్రి నగర్ పరిధిలో శ్రీశ్రీశ్రీ మధుర మీనాక్షి అమ్మవారి వీరభద్ర స్వామి ఆలయం శిఖర కలశం ప్రతిష్ట కుంభాభిషేకం మహోత్సవానికి ఆహ్వాన పత్రికను బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరికి అందజేసిన ఆలయ కమిటీ సభ్యులు
కుత్బుల్లాపూర్, ప్రజాజ్వాల:

# మూడు నెలలుగా వేతనాలు కరువు

-జిల్లాలో 486 మంది ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు., -వేతనాల కోసం అధికారులకు వినతి పత్రాలు
-అయినా అందని వేతనం., -ఇబ్బందుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, -ఆందోళనకు శ్రీకారం చుట్టే అవకాశం.







**హత్నూర (ప్రజాజ్వాల):**
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వలసల నివారణ కోసం కూలీలకు గ్రామాల్లోనే పని కల్పిస్తూ పనులను పర్యవేక్షిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ లకు మూడు నెలలుగా వేతనం కరువైంది. క్షేత్రస్థాయిలో అధికారుల ఆదేశం పాటిస్తూ కూలీలకు పని కల్పించడమే కాకుండా వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం ప్రతినెలా రావడం లేదు. జిల్లాలో 619 గ్రామపంచాయతీలలో 486 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. 2006 సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయాంలో ఫీల్డ్ అసిస్టెంట్లను నియామకం చేపట్టింది. 2019లో కేసీఆర్ ముఖ్యమంత్రి అయినంక ఫీల్డ్ అస్తున్న వ్యవస్థను పక్కకు పెట్టారు. తిరిగి ఫీల్డ్ అసిస్టెంట్లు ఉద్యమాలు చేసి కోర్టు కేసు ద్వారా తిరిగి 2023 సెప్టెంబర్ 11న ఫీల్డ్ అసిస్టెంట్లు ఉద్యోగంలో చేరారు. అప్పటినుండి గ్రేడ్ వన్ గ్రేడ్ 2 గ్రేడ్ 3 ఫీల్డ్ అసిస్టెంట్లకు గ్రేడ్ వన్ ఫీల్డ్ అసిస్టెంట్ కు 12,120, గ్రేటు ఫీల్డ్ అసిస్టెంట్ కు 10120, గ్రేడ్ 3 ఫీల్డ్ అసిస్టెంట్ కు 9100 వేతనాన్ని ప్రభుత్వం ఇస్తుంది. కానీ గత మూడు నెలలుగా వేతనాలు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు గ్రామంలోని పనులు కల్పించడంతోపాటు జాబ్ కార్డులను చూసి రికార్డులు రాయాలి, వీటితోపాటు ప్రస్తుత ప్రభుత్వం అదనంగా గ్రామపంచాయతీ కార్యక్రమాల్లో కూడా వాడుకుంటుందని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల వద్దకు చేరవేయడంలో కూడా ఫీల్డ్ అసిస్టెంట్లు భాగస్వాములు అవుతున్నారు . కానీ మాకు వేతనాలు ఇప్పించాలని జిల్లా మండల స్థాయి అధికారులకు సైతం నెలల తరబడి మెమొరండాలు శాంతియుతంగా ఆందోళన చేపడుతున్నారు. వేతనాలు వెంటనే మంజూరు చేయకుంటే మళ్లీ ఆందోళన బాట పట్టేందుకు జిల్లాలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు ఇప్పటికే సమావేశమై కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఒకవైపు ఉపాధి కూలీలకు వారాల తరబడి డబ్బులు ఇవ్వడం లేదు ,ఇటు ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా వేతనం ఇవ్వడం లేదు .దీంతో ఉపాధి హామీ పథకం రోజురోజుకు క్షేత్రస్థాయిలో నిర్వీర్యం అయ్యే పరిస్థితులు నెలకొన్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.వెంటనే మూడు నెలల వేతనాలు అందించాలి. సాయిలు ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ కూలీలను సమన్వయ పరుస్తూ కష్టపడుతున్న మాకు వెంటనే మూడు నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలి. అధికారులకు ఇప్పటికీ వినతి పత్రాలు ఇచ్చాం, అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు, అసలే చాలీచాలని వేతనాలు ఆపై నెలల తరబడి వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతకాలి. వెంటనే వేతనాలు ఇవ్వకుంటే శాంతియుతంగా నిరసన తెలిపేందుకు కూడా వెనకాడమన్నారు.వెంటనే వేతనాలు విడుదల చేయాలి. విజయ్ కుమార్ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షులు హత్నూర.కష్టపడి పని చేస్తున్న వేతనాలు అందడం లేదు. వెంటనే ప్రభుత్వం వేతనాలు విడుదల చేయాలి. పనిచేస్తున్నాం కానీ కుటుంబాన్ని పోషించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతకాలి. ప్రభుత్వం వెంటనే వేతనాలు విడుదల చేయాలి.

# మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

-మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు గున్నాల నర్సింహులు



**హత్నూర, ప్రజాజ్వాల:**
మత్స్యకారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గున్నాల నర్సింహులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన హత్నూర రైతు వేదికలో హత్నూర మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మత్స్యశాఖ జిల్లా అధికారి ఆర్ఎల్. మధుసూధన్, కోఆపరేటివ్ సొసైటీ జిల్లా అధికారి కిరన్ కుమార్ లు హాజరయ్యారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ మత్స్యకారులు ప్రభుత్వం అమలుచేసే ఆయాపథకాల ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించడానికి కృషిచేయాలన్నారు. అదేవిధంగా చేపల పెంపకం, మార్కెటింగ్ చేయడంలో అనుభవం కలిగివుండటం ద్వారా లాభాలు ఆర్జించవచ్చున్నారు. కొత్తగా సభ్యత్వాల కొరకు వృత్తినైపుణ్య పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాల్సి వుంటుందన్నారు. అనంతరం జిల్లా అధికారులు మాట్లాడుతూ మత్స్యకారులు క్రమం తప్పకుండా సొసైటీలలో సమావేశాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. . కోఆపరేటివ్ సొసైటీల ద్వారా అవసరం ఉన్న సంఘాలకు స్వయం ఉపాధినిమిత్తం రుణాలు మంజూరుచేయడానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నాయని వారు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ వినయక్కుమార్, శ్రీనివాస్ రావు, హత్నూర సొసైటీ అధ్యక్షుడు బిక్షపతి, డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయిలో రెండు ప్రథమ ర్యాంకులు సాధించిన భాగ్యరధి జూనియర్ కళాశాల విద్యార్థులు







**హైదరాబాద్, చింతల్:**
భాగ్యరధి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇటీవలి ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభను చాటారు. వివిధ గ్రూపులలో పలు రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకులు సాధించడమే కాకుండా, అత్యుత్తమ మార్కులతో కళాశాల గౌరవాన్ని పెంచారు.సీనియర్ బైపీసీ గ్రూపులో చదువుతున్న ఆఫ్షన్ జెబీన్ 996/1000 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించింది. ఎంపీసీ గ్రూపులో ఎల్.రవీన 990/1000 మార్కులతో, సీఈసీ గ్రూపులో షాహిమా 983/1000 మార్కులతో, ఎంఈసీ గ్రూపులో బి.నందిని కూడా 983/1000 మార్కులతో రాష్ట్రస్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించారు.జూనియర్ ఇంటర్మీడియట్ లోనూ సానియా బేగం (ఎంఈసీ గ్రూపు) 495/500 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. బైపీసీ గ్రూపులో ఎండి.అవేజ్ 435/440 మార్కులు, ఎంపీసీ గ్రూపులో ఎల్.అంజలి 463/470 మార్కులు, సీఈసీ గ్రూపులో ఎస్.అనూష 480/500 మార్కులు సాధించి కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. "రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన విద్యార్థులకు ద్వితీయ సంవత్సరానికి పూర్తి ట్యూషన్ ఫీజును మాఫీ చేస్తున్నాం. భాగ్యరధి కళాశాల తక్కువ ఫీజుతో అత్యున్నత ఫలితాలు అందించడంలో ముందుంది. ఈ ఏడాది రెండు రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకులు సాధించడం గర్వకారణం," అని తెలిపారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు సిహెచ్.గోవిందరెడ్డి, కె.రామకృష్ణ, జి.రమేష్ బాబు, నల్ల జై శంకర్ గౌడ్ పాల్గొన్నారు.


## చిదిరాల రామస్వామి కుటుంబానికి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చేయూత

**పాలకుర్తి,ప్రజాజ్వాల:**
పాలకుర్తి పట్టణ కేంద్రానికి చెందిన చిదిరాల రామస్వామి అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, 25 కిలోల బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలను ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జీడి హరీష్ లు అందజేశారు.
ఈ కార్యక్రమానికి సహకరించిన చిదురాల శ్రీనివాస్ (గడ్డం) టీచర్ కి ట్రస్ట్ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కోశాధికారి ఒర్రె కుమారస్వామి ట్రస్ట్ ప్రతినిధులు తాళ్లపల్లి రత్నాకర్ పెండ్లి భాస్కర్ మృతుడి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





ప్రవీణ్ చారి పుత్రుని మొదటి పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆహ్వానించిన కోటేష్ యాదవ్ తదితరులు నిజాం పేట్,ప్రజాజ్వాల:




హైదరాబాద్ – ప్రజాజ్వాల ప్రతినిధి

రాష్ట్రంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. అయితే ఫలితాలు వచ్చి 24 గంటలు కూడా గడవక ముందే ఆరుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. పరీక్షల్లో తాము ఫెయిలయ్యామన్న మనస్తాపంతో.. తెలంగాణ రాష్ట్రంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. అయితే ఫలితాలు వచ్చి 24 గంటలు కూడా గడవక ముందే ఆరుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. పరీక్షల్లో తాము ఫెయిలయ్యామన్న మనస్తాపంతో మంగళవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నలుగురు విద్యార్థులు బలవన్మరణాని కి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఇంటర్ ఫస్ట్ ఇయర్లో ఒక సబ్జెక్ట్ ఫెయిలైందని..హయత్ నగర్, తట్టి అన్నారం, వైయస్సార్ కాలనీకి చెందిన అరుంధతి (17) ఇంటర్ ఫస్ట్ ఇయర్ బైపీసీ చదువుతుంది. నిన్న విడుదలైన పరీక్ష ఫలితాల్లో బొటనీ సబ్జెక్టులో అరుంధతి ఫెయిల్ అయింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన విద్యార్థిని మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుని దారుణానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే నాగోల్ లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతురాలి సోదరుడు గౌతం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.కెమిస్ట్రీలో ఫెయిలైనందుకు బంజారాహిల్స్‌లో మరొకరు..ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఓ సబ్జెక్ట్ ఫెయిల్ అయినందుకు తీవ్ర మనస్తాపానికి గురైన బంజారాహిల్స్ రోడ్ నంబర్–2లోని ఇందిరానగర్ లో నివాసం ఉంటున్న సుమతి, రామకృష్ణల కూతురు నిష్ట (16).. కెమిస్ట్రీలో ఫెయిల్ అయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటి వరకూ కళ్లముందే ఉన్న తమ కూతురు విగతజీవిగా మారడంతో రామకృష్ణ దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అవంతినగర్ తోటలో నివాసముంటున్న ప్రైవేట్ ఉద్యోగి సత్యనారాయణ కుమారుడు ప్రశాంత్ (17) బల్కంపేటలోని 9 ఎడ్యుకేషన్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఓ సబ్జెక్టులో ఫెయిలైనట్లు రావడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మరోవైపు పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఘనశ్యాందాస్‌నగర్ (జీడీనగర్) గ్రామానికి చెందిన సాపల్ల ఎల్లయ్య, గంగమ్మ దంపతుల కుమార్తె శశిరేఖ (17) అనే విద్యార్థిని, భువనగిరి మండలం బస్వాపురం గ్రామానికి చెందిన రాసాల మల్లేశ్, సునీత దంపతుల చిన్నకుమారుడు అఖిలేష్ యాదవ్ (17) అనే మరో విద్యార్థి కూడా ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఒక్క పరీక్ష మాత్రమే జీవితం అనుకుని అర్థాంతరంగా ప్రాణాలొదిలారు ఈ యువకిశోరాలు. ఫెయిల్ అయితే మళ్లీ సప్లిమెంటరీ పరీక్షలు రాయొచ్చు. చదువే ఇష్టం లేకపోతే నచ్చినపని చేస్తూ బతకొచ్చు. అంతేగాని లేనిపోని భయాలతో ఇలా ప్రాణాలొదిలి మీపైనే ప్రాణాలు పెట్టుకున్న కన్నోళ్లకు కడుపుకోత మిగల్చడం న్యాయం కాదు. ఓసారి ఆలోచించండి..

## ఉత్తరప్రదేశ్‌లో లేడీ అఘోరీ అరెస్ట్ మహిళ ఫిర్యాదుతో అదుపులోకి తీసుకున్న పోలీసులు



హైదరాబాద్ – ప్రజాజ్వాల ప్రతినిధి

లేడీ అఘోరీకి మోకిలా పోలీసులు ఊహించని షాక్ ఇచ్చారు. ఉత్తరప్రదేశ్ లో అఘోరీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగ్నపూజల పేరుతో మహిళ నుండి 10 లక్షలు వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొంది. తిరిగి డబ్బులు అడిగినందుకు అఘోరి అలియాస్ శ్రీనివాస్ చంపుతానంటూ బెదిరింపులు దిగారని పోలీసులకు కంప్లైంట్ చేసింది. ఈ నేపథ్యంలో... లేడీ అఘోరీకి మోకిలా పోలీసులు ఊహించని షాక్ ఇచ్చారు. ఉత్తరప్రదేశ్ లో అఘోరీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగ్నపూజల పేరుతో మహిళ నుండి 10 లక్షలు వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొంది. తిరిగి డబ్బులు అడిగినందుకు అఘోరి అలియాస్ శ్రీనివాస్ చంపుతానంటూ బెదిరింపులు దిగారని పోలీసులకు కంప్లైంట్ చేసింది. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. లేడీ అఘోరీని చీటింగ్ కేసులో అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్ ,మధ్య ప్రదేశ్ సరిహద్దుల్లో అఘోరీని అదుపులోకి తీసుకుని నగరానికి తీసుకువస్తున్నారు మోకిలా పోలీసులు. అఘోరీతో పాటు ఇటీవల తను వివాహం చేసుకున్న వర్షిణిని కూడా నగరానికి తరలిస్తున్నట్లు సమాచారం.రంగారెడ్డి జిల్లా, శంకర్ పల్లి మండలం, ప్రొద్దుటూర్ మండలానికి చెందిన ఓ మహిళ లేడీ అఘోరీ మోసాలను ఇటీవల బయటపెట్టింది. లేడీ అఘోరీతో 6 నెలల క్రితం పరిచయం అయినట్లు తెలిపింది. పరిచయం అయిన 2 నెలల తర్వాత ప్రొద్దుటూర్ లోని ప్రగతి రిసార్ట్స్ కు డిన్నర్ కు వచ్చిందని వెల్లడించింది. అప్పటి నుంచి తరచుగా ఫోన్ చేస్తూ వ్యక్తిగత విషయాలను తెలుసుకునేదని తెలిపింది. ఒక పూజ చేస్తే అంతా మంచి జరుగుతుందని మాయమాటలు చెప్పి నమ్మించిందని ఆ మహిళా వెల్లడించింది. లేడీ అఘోరీ మాటలు నమ్మి పూజకు అంగీకరించానని తెలిపింది. వారం రోజుల్లో పూజ చేద్దామని అందుకు ఖర్చుల కోసం రూ. 5 లక్షలు లేడీ అఘోరీ అకౌంట్ లో వేశానని తెలిపింది. ఆ తర్వాత పూజ కోసం యూపీలోని ఉజ్జయినిలోని ఫాం హౌస్ లోకి తీసుకెళ్లి పూజ చేసిందని తెలిపింది. మరుసటి రోజు మరో రూ. 5 లక్షలు తన అకౌంట్ లో వేయాలని లేకపోతే పూజ విఫలమై కుటుంబం నాశనమవుతుందని లేడీ అఘోరి భయపెట్టిందని చెప్పింది. అఘోరి మాటలకు భయపడిపోయి రూ. 5 లక్షలు అకౌంట్ లో వేశానని ఇలా మొత్తం రూ. 10 లక్షలు ముట్టజెప్పానని పోలీసుల ఫిర్యాదులో పేర్కొంది. దీన్ని అలుసుగా చేసుకుని అఘోరి మాతతో పూజ పూర్తి చేసుకున్నావు కనుక ఇంకా 5 లక్షలు ఇవ్వాలని లేదంటే నిన్ను, కుటుంబ సభ్యులను మంత్ర శక్తులతో అంతమొందిస్తానని.. బెదిరింపులకు పాల్పడ్డట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# అచ్చం 'దృశ్యం' సినిమాను తలపించిన కానిస్టేబుల్ మర్డర్ స్కెచ్..! చివరికి ఇలా జరిగిందేంటి?



హైదరాబాద్ – ప్రజాజ్వాల ప్రతినిధి

ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడి హత్య మూడు జిల్లాల్లో కలకలం రేపింది. కంచె చేనును మేస్తే కాపుకాసే వారెవరన్నట్లు ఓ కిరాతక కానిస్టేబుల్ పక్కా ప్లాన్ వేసి హతమార్చి అచ్చం దృశ్యం సినిమాను చూపించాడు. కానీ పోలీసుల విచారణలో ఆ కంత్రీగాడి మర్డర్ స్కెచ్ కథ అంతా బయటపడి అడ్డంగా బుక్ అయ్యాడు. అతనితో సుపారి తీసుకుని అభం శుభం ఎరుగని యువకుడిని హతమార్చిన ముఠా అరెస్ట్ అయ్యారు. ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడి హత్య మూడు జిల్లాల్లో కలకలం రేపింది. కంచె చేనును మేస్తే కాపుకాసే వారెవరన్నట్లు ఓ కిరాతక కానిస్టేబుల్ పక్కా ప్లాన్ వేసి హతమార్చి అచ్చం దృశ్యం సినిమాను చూపించాడు. కానీ పోలీసుల విచారణలో ఆ కంత్రీగాడి మర్డర్ స్కెచ్ కథ అంతా బయటపడి అడ్డంగా బుక్ అయ్యాడు. అతనితో సుపారి తీసుకుని అభం శుభం ఎరుగని యువకుడిని హతమార్చిన ముఠా అరెస్ట్ అయ్యారు. చివరికి వివాహేతర సంబంధమే ఇంతటి విషాదానికి కారణమైంది. మృతుడి సొంత పిన్ని మర్డర్ ప్లాన్‌లో పాత్రధారి కావడంతో గ్రామస్తులు ఆమెను చితకబాది పోలీసులకు అప్పగించారు. హంతక ముఠాను అరెస్టు చేసిన పోలీసులు కటకటాల వెనక్కు నెట్టారు.ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రానికి చెందిన సాయిప్రకాష్ అనే యువకుడు చేయూత స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్నాడు. అనేక సేవా కార్యక్రమాలతో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న ఈ యువకుడు వరంగల్ ఉమ్మడి జిల్లాలో సుపరిచితుడు. ఏప్రిల్ 15వ తేదీన తన కారులో వెంకటాపురం నుండి హనుమకొండకు వచ్చిన సాయిప్రకాష్ అకస్మాత్తుగా అదృశ్యమైపోయాడు. అతను ఏమైపోయాడో తెలియదు. అతని కారు ఏమైపోయిందో అడ్రస్ లేకుండా పోయింది. సెల్‌ఫోన్ నెట్‌వర్క్ లొకేషన్ ఆంధ్రప్రదేశ్ లోని పాలకొల్లులో చూపిస్తుంది. ఈ క్రమంలో సాయిప్రకాష్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.హనుమకొండ పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు విచారణలో నివ్వెరపోయే నిజాలు గుర్తించారు. సాయిప్రకాష్ హత్యకు గురైనట్లు గుర్తించారు. గతంలో వెంకటాపురం పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన శ్రీనివాస్ అనే ఓ కానిస్టేబుల్ సాయిప్రకాష్ చిన్నమ్మ నీలిమతో వివాహేతర సంబంధ పెట్టుకున్నాడు. ఆ వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన సాయి ప్రకాష్ అతన్ని సస్పెండ్ చేయించాడు. దీంతో అతనిపై కక్ష పెంచుకున్న శ్రీనివాస్ పక్కా ప్లాన్‌తో మర్డర్ స్కెచ్ వేశాడు. ఏప్రిల్15వ తేదీన హనుమకొండకు వచ్చిన సాయిప్రకాష్‌ను మట్టుపెట్టాలని ప్లాన్ చేశాడు శ్రీనివాస్.అప్పటికే ఒక నలుగురు వ్యక్తులకు సుపారీ ఇచ్చిన శ్రీనివాస్ వారితో సాయిప్రకాష్ కారును ఆటోలో ఫాలో అయ్యారు. హన్మకొండలోని గోపాలపూర్ సమీపంలో ఆటోతో కారును ఢీ కొట్టి, ఆ గ్యాంగ్ అంతా అతని కారులో ఎక్కారు. కారులోనే విచక్షణారహితంగా కొట్టి, అతన్ని శాలువాతో గొంతు నులిమి చంపేశారు. అదే కారులో హుస్నాబాద్ మార్గంలో వెళ్లి హుస్నాబాద్ సమీపంలోని ఒక వ్యవసాయ బావిలో డెడ్ బాడీని పడేశారు. ఏప్రిల్ 17వ తేదీన స్థానికులు బావిలో డెడ్ బాడీని గుర్తించారు. హుస్నాబాద్ పోలీసులు అతను ఎవరా అని ఆరా తీశారు. కానీ ఆ డెడ్ బాడీ ఎవరిదో గుర్తుపట్టలేకుండా ఉండటంతో హుస్నాబాద్ మున్సిపల్ సిబ్బంది అక్కడే ఖననం చేశారు. అయితే హనుమకొండ పోలీసుల విచారణలో నివ్వెరబోయే నిజాలు బయటపడ్డాయి. చివరికి కానిస్టేబుల్ శ్రీనివాస్ అదుపులోని తీసుకున్న పోలీసులు ఈ మర్డర్ స్కెచ్ వెనుక అసలు కథను రాబట్టారు. తన వివాహేతర సంబంధాన్ని బయటపెట్టి సస్పెండ్ చేయించాడనే కక్షతో అతన్ని హత్య చేయించినట్లు విచారణలో తేలింది. అయితే పోలీసుల అటెన్షన్ డైవర్ట్ చేయడం కోసం అచ్చం దృశ్యం సినిమా తరహాలో స్కెచ్ వేశారు. మృతుడి సెల్‌ఫోన్ ఓ రైలులో పారేశారు. ఆ రైలు పాలకొల్లు వెళ్లేసరికి స్విచ్ ఆఫ్ అయిపోయింది. పోలీసుల విచారణలో చివరిసారి లొకేషన్ పాలకొల్లు చూపించడంతో అంతా పాలకొల్లు వైపు దృష్టి పెట్టారు. కానీ కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకోవడంతో అసలు కథ బయటపడింది. అతనితోపాటు డెవిలీ సాయి, అరుణ్ కుమార్, అఖిల్, రాజు అనే నలుగురితో సహా కానిస్టేబుల్ ప్రియురాలు నిర్మలను కూడా పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక ఎయిర్ ఫిస్టల్, ఒక కారు, రెండు ఆటోలు స్వాదీనం చేసుకున్నారు.అయితే ఈ యువకుడి హత్యకు అతని చిన్నమ్మ నిర్మల కారణమని తెలియడంతో అరెస్ట్‌కు ముందు ఊరంతా భగ్గుమన్నారు. వెంకటాపురం గ్రామానికి చెందిన ప్రజలు, ఆమె భర్త ఆమెను జుట్టు పట్టుకుని చితకబదారు. చెప్పులతో కొట్టుకుంటూ రోడ్డుపై తీసుకెళ్లి వెంకటాపురం పోలీసులకు అప్పచెప్పారు. అనేక సేవా కార్యక్రమాలతో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న సాయిప్రకాష్ హత్య నేపథ్యంలో వెంకటాపురంలో విషాద వాతావరణం అలముకుంది. వ్యాపార సంస్థలతోపాటు ఊరంతా స్వచ్ఛందంగా బంద్ పాటించి సాయి ప్రకాష్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు..ఆ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.


# అంజన్న సన్నిధిలో ఆకలితో అలమటిస్తున్న వానరాలు.. కొండగట్టులో కోతుల అవస్థలు!



హైదరాబాద్ – ప్రజాజ్వాల ప్రతినిధి

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టులో కోతుల సందడి ఎక్కువగానే ఉంటుంది. ఇక్కడ అంజనేయస్వామి వారు కొండపైన కొలువై ఉన్నారు. చుట్టూ పచ్చని చెట్లు, అటవీ ప్రాంతం కావడంతో చాలా యేళ్లుగా ఇక్కడ కోతుల సంఖ్య పెరుగుతునే ఉంది. ఎటు చూసిన కోతులు సంచరిస్తాయి. అయితే క్రమ క్రమంగా చెట్లు అంతరించిపోవడంతో కోతుల జనావాసాల్లోకి వస్తున్నాయి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టులో కోతుల సందడి ఎక్కువగానే ఉంటుంది. ఇక్కడ అంజనేయస్వామి వారు కొండపైన కొలువై ఉన్నారు. చుట్టూ పచ్చని చెట్లు, అటవీ ప్రాంతం కావడంతో చాలా యేళ్లుగా ఇక్కడ కోతుల సంఖ్య పెరుగుతునే ఉంది. ఎటు చూసిన కోతులు సంచరిస్తాయి. అయితే క్రమ క్రమంగా చెట్లు అంతరించిపోవడంతో కోతుల జనావాసాల్లోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కోతుల ఆహారం కోసం గతంలో కొండ కింద మంకీ ఫుడ్ కోర్టును ఏర్పాటు చేశారు. కానీ ఒక్క పండ్ల మొక్క నాటలేదు. దీంతో గుడి ప్రాంతంలో సంచరిస్తున్న వానరాలు ఆహారం కోసం వేట కొనసాగిస్తున్నాయి. భక్తులు ఏమైనా తీసుకొస్తే లాక్కెళ్తున్నాయి. అంతేకాకుండా.. అప్పుడప్పుడు దాడులకు దిగుతున్నాయి. కోతులకు కడుపు నింపేందుకు దేవస్థానం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఆకలితో అల్లాడిపోతున్నాయి కోతులు.జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయస్వాం దేవస్థానానికి ప్రతి రోజూ పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. ఇతర రాష్ట్రాల నుంచీ.. ఇక్కడికి వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు. ఇక్కడ కొండపైన కొలువై ఉన్న అంజనేయస్వామి ఆలయానికి వందల సంవత్సరాల చరిత్ర ఉంది. ఇక్కడ చాలా యేళ్లుగా కోతులు ఉన్నాయి. అయితే.. గతంలో.. కొండపైన భారీ వృక్షాలు.. వివిధ రకాల పండ్ల చెట్లు ఉండటంతో.. ఎలాంటి సమస్య రాలేదు. అయితే అటవీ విస్తీర్ణం తగ్గడంతో పాటు పండ్ల చెట్లు కనుమరుగువుతున్నాయి. దీంతో కోతులన్నీ ఇక ఆలయానికి చేరుకుంటున్నాయి. మొత్తం ఆలయ పరిసర ప్రాంతాల్లోనే కోతులు సంచరిస్తున్నాయి. 15 యేళ్లుగా కోతులు భక్తులను ముప్పితిప్పలు పెడుతున్నాయి.ఈ నేపథ్యంలోనే కోతుల ఆహారం కోసం గతంలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. కొండ కింద.. మంకీ ఫుడ్ కోర్టును ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ రకాల పండ్ల మొక్కలు పెంచి.. వాటిని అక్కడికి తరలిస్తామని నిర్ణయం తీసుకున్నారు. కానీ, కేవలం బోర్డు మాత్రమే ఏర్పాటు చేశారు. తరువాత ఇక్కడ ఎలాంటి పండ్ల మొక్కలు నాటలేదు. ఆహారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కోతులన్నీ కొండపైన తిష్ట వేస్తున్నాయి. కొండ సమీపంలో చెట్లు ఉన్నా.. అధికంగా కలప చెట్లు ఉంటాయి. పండ్ల చెట్లు లేవు. దీని కారణంగా భక్తులను వానరాలు టార్గెట్ చేస్తున్నాయి. కడుపు నింపుకోవడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నాయి. భక్తుల చేతిలో ఏం ఉంటే.. అవి ఎత్తుకొని వెళ్తున్నాయి.ఇక్కడ ప్రసాదం తీసుకోవాలంటే.. భక్తులు భయపడుతున్నారు. అంతేకాకుండా చాలా మంది భక్తులు స్వామి వారి సన్నిధిలో గడుపుతారు. వంట చేసుకోవడం కూడా ఇబ్బందిగా ఉంది. ఆహార పదార్థాలు ఎత్తుకొని వెళ్తున్నాయి. భక్తులు చేతిలో కర్ర పట్టుకొని కాపాలా ఉంటున్నారు. ముఖ్యంగా కొండగట్టులో ఎలాంటి పండ్ల చెట్లు లేకపోవడంతో భక్తులు ఇచ్చే ఆహారంపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఎండకాలంలో.. ఆహారం కోసం మరింత ఇబ్బంది పడుతున్నాయి. అయితే, కొంత మంది భక్తులు.. ఇక్కడికి వచ్చి వివిధ రకాల పండ్లు ఇక్కడికి వచ్చి కోతులకు పెడుతున్నారు. కానీ.. అ ఏమాత్రం సరిపోవడం లేదు. సహజంగానే హనుమాన్ ఆలయాల వద్ద ఎక్కువగా కోతులు ఉంటాయి. వాటికి కడుపు నింపేందుకు అధికారులు ఎలాంటి ఆలోచన చేయడం లేదని భక్తులు మండిపడుతున్నారు. పెద్ద ఎత్తున పండ్ల మొక్కలు నాటి.. కోతుల జోన్ ఏర్పాటు చేసి వాటికి ఆహారాన్ని అందించాలని భక్తులు కోరుతున్నారు. ప్రతి రోజూ ఇక్కడ కోతులు రంగం చేస్తున్నాయి. ఒక్కసారి కోతి పైకి వస్తే.. చేతిలో ఏం ఉన్న వదిలిపెట్టి వెళ్తారు. గతంలో చేతిలో ఉన్న బ్యాగ్‌లు, సెల్‌పోన్లు ఎత్తుకెళ్లిన సందర్భాలు ఉన్నాయి. వాటిని మళ్లీ కోతుల నుంచీ తీసుకోవడానికి భక్తులు నానా తంటాలు పడాల్సి వస్తుంది.అయితే.. మంకీ ఫుడ్ కోర్టును అభివృద్ధి చేసి, భారీగా పండ్ల మొక్కలు పెంచితే తప్ప కొంత మేరకు భక్తులకు బాధలు తప్పేలా లేవు. లేదంటే.. భయం.. భయంగానే భక్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ కోతులు ఎక్కువగా ఉన్నాయని, చేతిలో ప్రసాదం పట్టుకుంటే ఎత్తుకొని వెళ్తున్నాయని భక్తులు అంటున్నారు. చాలా జాగ్రత్తగా తీసుకొని వెళ్తున్నామని చెబుతున్నారు. పిల్లలు భయపడుతున్నారని అంటున్నారు. కోతుల కోసం.. పెద్ద ఎత్తున పండ్ల మొక్కలు నాటి, వాటికి ఆహారాన్ని అందించాలని భక్తులు కోరుతున్నారు.

# సోషల్ మీడియా మాటున చాటుమాటు యవ్వారం.. సీన్ తెలిస్తే దిమ్మతిరిగిపోతుంది.!



హైదరాబాద్ – ప్రజాజ్వాల ప్రతినిధి

హైదరాబాద్ మహానగరాన్ని మాదకద్రవ్యాల రహిత నగరంగా మార్చాలని ప్రభుత్వం ముందుకు సాగుతుంటే.. కేటుగాళ్లు మాత్రం కొత్త కొత్త మార్గాలు అన్వేషిస్తున్నారు. తాజాగా నగరంలో మరో దందా బట్టబయలు అయ్యింది. పెద్ద ఎత్తున నిషేధిత ఈ–సిగరెట్లను, వేపింగ్ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హైదరాబాద్ మహానగరాన్ని మాదకద్రవ్యాల రహిత నగరంగా మార్చాలని ప్రభుత్వం ముందుకు సాగుతుంటే.. కేటుగాళ్లు మాత్రం కొత్త కొత్త మార్గాలు అన్వేషిస్తున్నారు. తాజాగా నగరంలో మరో దందా బట్టబయలు అయ్యింది. పెద్ద ఎత్తున నిషేధిత ఈ–సిగరెట్లను, వేపింగ్ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నాంపల్లి ప్రాంతానికి చెందిన సాదిక్ అలాని, అనిల్ అలాని అనే ఇద్దరు అన్నదమ్ములు పేరుతో ఏకంగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, దాని ద్వారా వీటిని విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దాదాపు 500 మందికి పైగా సభ్యులను ఈ గ్రూప్‌లో ఉన్నట్లు నిర్ధారించారు. ముఖ్యంగా స్కూల్, కాలేజ్ స్టూడెంట్స్‌ను టార్గెట్ చేసి అమ్మకాలు జరుపుతున్నట్లు గుర్తించారు. గుట్టుచప్పుడు కాకుండా సాగిస్తున్న ఈ దందాకు పోలీసులు ఫైనల్ గా చెక్ పెట్టారు.ఈ ముఠా గురించి సమాచారం అందడంతో.. నెట్‌వర్క్ పరిధి తెలుసుకునేందుకు పోలీసులు నిఘా పెట్టారు. కొత్త స్టాక్ వచ్చినప్పుడు వాట్సాప్ గ్రూప్‌లో అప్డేట్ ఇస్తున్నట్లు గుర్తించారు. తెలివిగా కొనుగోలుదారులు నుంచి నేరుగా నగదు తీసుకోకుండా.. తమ కుటుంబ సభ్యులకు యూపీఐ, పేటీఎం, బ్యాంక్ ట్రాన్స్‌ఫర్ల ద్వారా డబ్బులు పంపమనేవారు. పక్కా ఆధారాలు సేకరించి నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.న్యూఢిల్లీకి చెందిన అమిత్, ముంబైకి చెందిన వసీం నిందితులకు ఈ సిగరెట్స్, వేప్స్ సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది. పెద్ద మొత్తంలో నగదు లావాదేవీల కోసం హవాలా మార్గాలను కూడా ఉపయోగించారన్న కోణంలో కూడా దర్యాప్తు సాగుతోంది. ర్యాపిడో, ఉబర్ వంటి సర్వీసులతో పాటు డీటీడీసీ కొరియర్ ద్వారా కూడా ఈ–సిగరెట్లను నిందితులు సరఫరా చేస్తున్నట్టు పోలీసులు చెబుతున్నారు.కాగా నిందితుల వద్ద నుంచి 25 లక్షల రూపాయల విలువైన ఈ సిగరెట్స్, 225 అమెరికన్ డాలర్లు, 100 కెనడియన్ డాలర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద కొనుగోలుదారులుగా ఉన్నవారిని కనిపెట్టే పనిలో పోలీసులు ఉన్నారు. ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు నిఘా పెట్టారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, సమాజంలోని ప్రజలందరూ ఈ–సిగరెట్లు, వేప్‌లు వంటి నిషేధిత వస్తువుల వాడకం గురించి సమాచారం ఇవ్వాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు కోరారు. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపం కనిపిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1908కు లేదా ఇమెయిల్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ–సిగరెట్లు, వేప్‌లు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. ముఖ్యంగా యువత, పిల్లలపై చెడు ప్రభావం చూపుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ కారణంగా వీటిని భారత్‌లో నిషేధించారు. అయినప్పటికీ, అక్రమంగా అమ్మకాలు జరుగుతున్నాయి. దీనిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని %u+ూచీదీ% అధికారులు తెలిపారు.




## 'యానిమల్' విలన్ లవ్ స్టోరీనే రిపీట్ చేసిన టీమిండియా ప్లేయర్.. ఎవరో తెలుసా?



మహ్మద్ కైఫ్ భార్య పూజా కైఫ్ గతంలో జర్నలిస్ట్. వివాహానికి ముందు ఆమె పేరు పూజా యాదవ్. మొదటి చూపులోనే ప్రేమలో పడిన తర్వాత, ఇద్దరూ దాదాపు 4 సంవత్సరాలు డేటింగ్ చేసి, 2011లో వివాహం చేసుకున్నారు. అబ్రార్ జీవితంలో కూడా ఇలాంటిదే జరిగింది. మీరు యానిమల్ సినిమా చూసే ఉంటారు. అందులో విలన్ అబ్రార్ పాత్రను కూడా చూసి ఉంటారు. కానీ, మనం ఆ పాత్ర గురించి కాదండోయ్.. ఆ పాత్ర పోషించిన నటుడు బాబీ డియోల్ గురించి మాట్లాడుతున్నాం. మొహమ్మద్ కైఫ్ అనే టీమిండియా మాజీ క్రికెటర్‌కు కూడా ఇలాంటి ప్రేమకథే ఉంది. బాబీ డియోల్, మహ్మద్ కైఫ్ ప్రేమకథలో సారూప్యత ఏమిటంటే, ఇద్దరూ ఒకే చోట వేర్వేరు అమ్మాలతో ప్రేమలో పడ్డారన్నమాట. వీరిద్దరి లవ్ స్టోరీలో వారి స్నేహితుల పాత్ర కూడా కీలకంగా మారింది. బాబీ డియోల్ ప్రేమకథను పోలిన కైఫ్ లవ్ స్టోరీ..ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, బాబీ డియోల్, మొహమ్మద్ కైఫ్ ఇద్దరూ హృదయాలను కోల్పోయిన ఆ ప్రదేశం ఏంటి, ఎక్కడ ఉంది. అందుకు సమాధానం ఓ రెస్టారెంట్. బాబీ తన స్నేహితులతో కలిసి ఒక రెస్టారెంట్‌కి వెళ్లి తాన్యా అహుజాతో మొదటి చూపులోనే ప్రేమలో పడ్డాడు. అదేవిధంగా, మహ్మద్ కైఫ్ కూడా తన స్నేహితుల ఆహ్వానం మేరకు రెస్టారెంట్‌కు చేరుకున్నాడు. అక్కడ అతను పూజను మొదటిసారి కలిశాడు. ఈ క్రమంలో ప్రేమికులుగా మారిన వీళ్లు ఆ తర్వాత పెళ్లి పీటలు ఎక్కి ఒక్కటయ్యారు. బాబీ డియోల్ భార్యగా తాన్యా అహుజా మారిపోగా, పూజ మొహమ్మద్ కైఫ్ భార్య అయ్యింది.

## కేఎల్ రాహుల్ వర్సెస్ సంజీవ్ గోయెంకా.. అందరిచూపు ఈ ఇద్దరిపైనే..



ఢిల్లీ క్యాపిటల్స్ వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరగనున్న మ్యాచ్ చాలా ఉత్కంఠభరితంగా ఉండబోతోంది. ఈ మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ తన పాత జట్టుకు వ్యతిరేకంగా ఆడనున్నాడు. గత సీజన్‌లో రాహుల్, లక్నో జట్టు యజమాని సంజీవ్ గోయెంకా మధ్య తీవ్ర వాదన జరగనుంది.ఐపీఎల్ 2025లో భాగంగా 40వ మ్యాచ్‌లో, ఢిల్లీ క్యాపిటల్స్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో తలపడనుంది. ఈ మ్యాచ్ లక్నోలోని ఎకానా స్టేడియంలో జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో అభిమానులు ఒక ప్రత్యేకమైన పోరును చూడనున్నారు. ఈ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ బ్యాట్స్‌మన్ కేఎల్ రాహుల్ తన పాత జట్టు లక్నో సూపర్ జెయింట్స్‌కు వ్యతిరేకంగా బరిలోకి దిగనున్నాడు. గత సీజన్‌లో కేఎల్ రాహుల్ లక్నో సూపర్‌జెయింట్స్‌కు కెప్టెన్‌గా ఉన్నాడు. కానీ, రాబోయే సీజన్‌కు ఫ్రాంచైజీ అతన్ని రిటైన్ చేసుకోలేదు. గత సీజన్‌లో కేఎల్ రాహుల్, ఎల్ఎస్‌జీ జట్టు యజమాని సంజీవ్ గోయెంకా మధ్య వివాదంతో హీటెక్కిన సంగతి తెలిసిందే.కేఎల్ రాహుల్, సంజీవ్ గోయెంకా వాగ్వాదం.. గత సీజన్‌లో లక్నో ఓటమి తర్వాత కేఎల్ రాహుల్‌తో తీవ్ర వాగ్వాదానికి దిగిన లక్నో యజమాని సంజీవ్ గోయెంకా వార్తల్లో నిలిచాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఘోర పరాజయం తర్వాత సంజీవ్ గోయెంకా కెప్టెన్ కేఎల్ రాహుల్‌పై విమర్శలు గుప్పించాడు. రాహుల్‌ను బహిరంగంగా తిట్టిన తీరుకు సంజీవ్ గోయెంకా చాలా విమర్శలు ఎదుర్కొన్నాడు. ఆ తరువాత, సంజీవ్ గోయెంకా, కేఎల్ రాహుల్ మధ్య చెడిందని వార్తలు వచ్చాయి. తర్వాత కేఎల్ రాహుల్ లక్నో జట్టు నుంచి విడిపోయాడు.ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ తమ మొదటి మ్యాచ్‌ను లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో ఆడింది. కానీ, కేఎల్ రాహుల్ భార్య తొలి బిడ్డకు జన్మనివ్వడంతో ఆ మ్యాచ్‌లో పాల్గొనలేకపోయాడు. అప్పుడు ఢిల్లీ జట్టు అద్భుతమైన విజయాన్ని సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన లక్నో 209 పరుగులు చేసింది. దీనికి ప్రతిస్పందనగా, ఢిల్లీ 9 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. ఈసారి కేఎల్ రాహుల్ ఆడటం ఖాయం. మరి ఇటువంటి పరిస్థితిలో, ఢిల్లీ బలంగా కనిపిస్తోంది.

## ఈ సీజన్ పై నాకు నమ్మకం లేదు దొరా!



ఐపీఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్ ప్రదర్శనపై మాజీ క్రికెటర్ అంబటి రాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్లేఆఫ్స్‌కు అవకాశం లేకుండా పోయిందని, జట్టు ఇప్పటికే యువ ఆటగాళ్లను సెట్ చేయాలని చూస్తోందని తెలిపారు. మధ్య ఓవర్లలో చెన్నై స్కోరు తగ్గినదే పరాజయానికి ప్రధాన కారణమని వివరించారు. ధోనీ భవిష్యత్, జట్టు వ్యూహంపై రాయుడు వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. ఐపీఎల్ 2025 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ప్రదర్శనపై భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు తన అభిప్రాయాన్ని బహిర్గతం చేశారు. ఆదివారం వాండే స్టేడియంలో ముంబై ఇండియన్స్ చేతిలో ఓటమి పాలైన అనంతరం, చెన్నై జట్టు ఈ సీజన్‌లో తిరిగి పోటీకి వచ్చే అవకాశాలు కనపడట్లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై జట్టు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉండటం, ఈ ఓటమితో కలిసి మొత్తం ఆరో ఓటమిని నమోదు చేయడం వల్ల ప్లేఆఫ్ ఆశలు దాదాపుగా చారిత్రకంగా ముగిసిపోయినట్లయింది. ఓపెనర్ల నుండి మెరుగైన ఆరంభాన్ని పొందడంలో %జూఖ% మరోసారి విఫలమైంది, అయితే అరంగేట్ర ఆటగాడు ఆయుష్ మాత్రే 15 బంతుల్లో రెండు సిక్సర్లు, నాలుగు ఫోర్లతో 32 పరుగులు చేసి జట్టుకు కొంత ఊరటను అందించాడు. అనంతరం రవీంద్ర జడేజా, శివం దూబే అర్ధ సెంచరీలు చేసి జట్టును 176/5 స్కోరుకు చేర్చారు.అయితే ముంబై ఇండియన్స్ కేవలం 15.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించడంలో విజయవంతమైంది. రోహిత్ శర్మ అజేయంగా 76 పరుగులు చేయగా, సూర్యకుమార్ యాదవ్ నాటౌట్‌గా 68 పరుగులు చేశాడు. ఈ పరాజయం అనంతరం జియోహాట్‌స్టార్‌లో మాట్లాడిన రాయుడు, "వాళ్లు ఇప్పటికే తదుపరి సీజన్ కోసం ఎదురు చూస్తున్నారు. యువ ఆటగాళ్లను తీర్చిదిద్దాలని, నిర్భయమైన క్రికెట్ సంస్కృతిని నెలకొల్పాలని చెన్నై ఆశిస్తోంది," అంటూ ధోనిని కూడా ఈ విషయం అంగీకరించాడని చెప్పారు. ఆయుష్ మాత్రే లాంటి ఆటగాళ్లకు ఇకపై పూర్తి అవకాశాలు లభించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రదర్శనపై మరింతగా స్పందించిన రాయుడు, "మిడిల్ ఓవర్లలో దాదాపు ఏడు ఓవర్లలో కేవలం 35 పరుగులు మాత్రమే చేయడం జట్టుకు తీవ్ర నష్టం కలిగించింది. టి20 క్రికెట్ ఇప్పుడు చాలా వేగంగా మారింది. మిడిల్ ఓవర్లలో కూడా జట్లు వేగంగా స్కోర్ చేయడం అవసరం. %జూఖ%కి ఆ గేమ్‌లో తగిన ఉద్దేశ్యం కనిపించలేదు. ఒక ఆటను కోల్పోవచ్చు, కానీ పోరాడాలన్న ఉద్దేశ్యం అవసరం. మీరు స్టార్ట్ స్లోగా చేసి, చివర్లో స్పీడ్ పెంచాలని ఆశించడం సరైన వ్యూహం కాదు," అని అన్నారు. ఆ పిచ్‌పై పోటీకి కనీసం 190 పరుగులు అవసరమని, %జూఖ% అందించిన స్కోరు సరిపోలేదని కూడా రాయుడు స్పష్టం చేశారు.తదుపరి షెడ్యూల్ ప్రకారం, ముంబై ఇండియన్స్ బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుండగా, చెన్నై శుక్రవారం అదే ప్రత్యర్థిని చెన్నైలో ఎదుర్కొననుంది. ఈ నేపథ్యంలో ప్రదర్శనపై వస్తున్న విమర్శలు, యువ ఆటగాళ్లపై పెట్టిన ఆశలు, ధోనీ భవిష్యత్తు పాత్రపై చర్చలు మళ్లీ వేగం పుంజుకున్నాయి. రాయుడు వ్యాఖ్యలు ఈ సమస్యలన్నింటిపై వెలుగును ప్రసరించాయి.

## అలా అవుతుందని నాకు ముందే తెలుసు!
## ఈడెన్ గార్డెన్స్ లో బ్యాన్ అవ్వడంపై నోరు విప్పిన హర్ష!



హర్ష భోగ్లే, సైమన్ డౌల్‌లపై %జూదీ% ఫిర్యాదుతో ఈడెన్ గార్డెన్స్ కామెంటరీ నుంచి తప్పించినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై హర్ష స్పందిస్తూ, తాను హాజరుకాని మ్యాచ్ తన షెడ్యూల్‌లో లేదని, కుటుంబ ఆరోగ్య సమస్యల వల్ల కూడా మిస్ అయ్యానని స్పష్టం చేశారు. పిచ్ పరిస్థితులపై వ్యాఖ్యలు చేయడమే ఈ వివాదానికి మూలమని ఊహలు వినిపిస్తున్నాయి. ఈ సంఘటన వ్యాఖ్యాతల స్వేచ్ఛ, ఫ్రాంచైజీ-బోర్డు సంబంధాల మధ్య నిఖార్సైన చర్చకు దారితీసింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఈడెన్ గార్డెన్స్ వేదికపై వ్యాఖ్యాతగా బ్యాన్ అవ్వడంపై వచ్చిన వార్తలపై ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత హర్ష భోగ్లే చివరకు స్పందించారు. బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (%జూదీ%) ఫిర్యాదు ఆధారంగా భోగ్లేను, న్యూజిలాండ్‌కు చెందిన వ్యాఖ్యాత సైమన్ డౌల్‌ను ఈడెన్ వేదికపై జరిగే మ్యాచ్‌ల కామెంటరీ ప్యానెల్ నుంచి తొలగించారని వార్తలు వెలుగులోకి వచ్చాయి. %జూదీ% కార్యదర్శి నరేష్ ఓజా బీసీసీఐకి పంపిన లేఖలో ఈడెన్ గార్డెన్స్ పిచ్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు అనుకూలంగా లేదని పేర్కొనడంతో పాటు, భోగ్లే, డౌల్‌ల వ్యాఖ్యలు వేదికను దూషించేవిగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో, హర్ష భోగ్లే తన '%శ%' (గతంలో ట్విట్టర్) ఖాతాలో స్పందిస్తూ, తాను కోల్‌కతాలో జరిగిన గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌కు గైర్హాజరుకావడానికి కారణం ఎటువంటి వివాదం కాదని, ఇది పూర్తిగా తాను ఎంపికైన మ్యాచ్‌ల జాబితాకు సంబంధించిన వ్యవహారమని స్పష్టం చేశారు. "నిన్నటి కోల్‌కతా ఆటకు నేను ఎందుకు హాజరు కాలేదనే దానిపై కొన్ని తగని నిర్ణయాలు తీసుకుంటున్నారు.

చాలా సరళంగా చెప్పాలంటే, నేను కామెంట్రీ చేయాల్సిన మ్యాచ్‌ల జాబితాలో అది లేదు!" అని ఆయన పేర్కొన్నారు. కోల్‌కతాలో జరిగిన రెండు మ్యాచ్‌లకు మాత్రమే తాను ఎంపికయ్యానని, మొదటి మ్యాచ్‌కు హాజరయ్యానని, రెండవ మ్యాచ్‌కు మాత్రం కుటుంబంలో అనారోగ్యం కారణంగా హాజరుకాలేకపోయానని వివరించారు.ఇదిలా ఉండగా, %జూదీ% క్యూరేటర్ సుజన్ ముఖర్జీపై వచ్చిన విమర్శలు, పిచ్ పరిస్థితులపై కూడా వివాదం నెలకొంది. కెప్టెన్ అజింక్య రహానే, ప్రధాన కోచ్ చంద్రకాంత్ పండిట్ ఈడెన్ వేదిక మరింత స్పిన్ ఫ్రెండ్లీగా ఉండాలని అభిప్రాయపడుతూ, తమ బౌలింగ్ యూనిట్ అయిన వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్, మోయిన్ అలీలకు అనుకూలంగా ఉండే ట్రాక్‌ను ఇవ్వలేదని నిరాశ వ్యక్తం చేశారు. దీనిపై సైమన్ డౌల్ స్పందిస్తూ, క్యూరేటర్ సుజన్ ముఖర్జీ జట్టు అవసరాలను తీరుస్తున్నారో లేదో అనుమానం వ్యక్తం చేస్తూ, అవసరమైతే కొత్త హోమ్ వేదిక కోసం పరిశీలించాలన్న సలహా కూడా ఇచ్చాడు.ఈ పిచ్ వివాదానికి సంబంధించి హర్ష భోగ్లే కూడా స్పందిస్తూ, హోమ్ అడ్వాంటేజ్ ఉండటం లాజికల్, ఇది సహజమే," అని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడమే తమను ప్యానెల్ నుంచి తప్పించినందుకు కారణమని ఊహించడంతో పాటు, అసలు తనకు ఆ మ్యాచ్‌కి ఎంపికే కాలేదని స్పష్టత ఇచ్చారు. ఈ వివాదంపై ఆయన చేసిన వ్యాఖ్యలు, అనవసరమైన అర్థాంతరాలు క్లియర్ చేయడంలో సహాయపడ్డాయి. మొత్తానికి, ఇది ఐపీఎల్ సీజన్‌లో ఓ పక్కన జరిగే చిన్నపాటి వివాదంలా కనిపించినా, వ్యాఖ్యాతల స్వేచ్ఛ, పిచ్ పరిస్థితులపై టీమ్‌ల అభిప్రాయాలు, ఫ్రాంచైజీ-అసోసియేషన్ మధ్య గల సంబంధాలను వెలుగులోకి తెచ్చిన సంఘటనగా నిలిచింది.




లక్నో నుంచి విడుదలైన తర్వాత కేఎల్ రాహుల్ ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడుతున్నాడు. ఢిల్లీ తరపున అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఒక ఇంటర్వ్యూలో సంజీవ్ గోయెంకాకు గట్టిగా ఇచ్చిపడేశాడు. ఐపీఎల్ 2025లో భాగంగా 44వ మ్యాచ్ లక్నో సూపర్ జెయింట్స్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరగనుంది. ఈ మ్యాచ్‌లో, మాజీ లక్నో కెప్టెన్ కేఎల్ రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడుతున్నాడు. ఢిల్లీ కెప్టెన్ రిషబ్ లక్నో జట్టులో భాగమయ్యాడు. ఈ మ్యాచ్‌లో రెండు జట్ల మధ్య ప్రతీకార జ్వాలలు కనిపిస్తున్నాయి. కానీ, ఈ మ్యాచ్‌కు ముందు, కేఎల్ రాహుల్ ఒక ఇంటర్వ్యూలో కీలక విషయాలను వెల్లడించాడు. దీంతో సంజీవ్ గోయెంకాకు గట్టిగానే ఇచ్చిపడేశాడు.ఎట్టకేలకు మౌనం వీడిన కేఎల్ రాహుల్..ఐపీఎల్ గత సీజన్ కేఎల్ రాహుల్ ఒడిదుడుకులను ఎదుర్కొన్నాడు. అతను లక్నోలో భాగంగా ఉన్నాడు. చాలా విమర్శలను ఎదుర్కోవలసి వచ్చింది. నెమ్మదిగా బ్యాటింగ్ చేస్తున్నాడని అతనిపై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి.లైవ్ మ్యాచ్ సమయంలో, సంజీవ్ గోయెంకా, కేఎల్ రాహుల్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆ తరువాత కేఎల్ రాహుల్ చాలా ఉద్రిక్తంగా కనిపించాడు. కానీ, అతను 18వ సీజన్‌కు ముందే విడుదలయ్యాడు. ఆ తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు అతన్ని మెగా వేలంలో కొనుగోలు చేసింది. ఆ తరువాత ఈ విషయంపై ఎప్పుడు మాట్లాడలేదు. తాజాగో ఓ ఇంటర్వ్యూలో దీనిపై స్పందించాడు."ఐపీఎల్ 2024 రిటెన్షన్ తర్వాత నేను మళ్ళీ ఆడాలని అనుకున్నాను, సీఎస్కే, గుజరాత్ వంటి జట్లు పోటీ పడ్డాయి. అలా జరిగి ఉంటే, ఆటగాడిగా నాకు మంచి అవకాశంగా ఉండేది. ఢిల్లీ జట్టు చాలా బలంగా కనిపిస్తోంది. ఐపీఎల్‌లో చాలా ఒత్తిడి ఉంది. ఇప్పటికే దానిని ఎదుర్కొన్నాం. నేను అలసిపోయానంటూ, పరుగులు చేయలేనంటూ విమర్శలు గుప్పించారు. కానీ, కాలమే అన్నింటికి సమాధానం ఇస్తుంది. చివరికి నాకే మంచి జరిగింది." అంటూ చెప్పుకొచ్చాడు.సంజీవ్ గోయెంకా విషయానికొస్తే, అతను లక్నో సూపర్ జెయింట్స్ యజమాని. కేఎల్ రాహుల్ చివరి ఐపీఎల్ సీజన్ ఎంతో ఉద్రిక్తతతో కనిపించింది. ఆ సమయంలో ఎన్నో ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిలో సంజీవ్ గోయెంకా లైవ్ మ్యాచ్‌లో భారత బ్యాట్స్‌మన్‌ను మందలిస్తున్నాడు. దీనిని భారత మాజీ ఆటగాళ్ళు కూడా విమర్శించారు. అతను వీధి క్రికెటర్ కాదు, అతనితో ఇలా వ్యవహరించకూడదంటూ సూచించారు.కానీ, ఆ సమయంలో లోకేష్ రాహుల్ ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. రూ.28,390 కోట్ల ఎల్ఎస్‌జీ యజమానికి తన తప్పును తెలుసుకునేలా చేస్తున్నాడు. లక్నో రిషబ్ పంత్‌ను 27 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. కానీ, పంత్ ధరలో సగం ఉన్న కేఎల్ రాహుల్ ఆడటం చూసినప్పుడల్లా, సంజీవ్ గోయంకా బాధపడుతున్నాడు. దీంతో ఫ్యాన్స్ కూడా సంజీవ్ గోయెంకాకు కేఎల్ రాహుల్ నుంచి ఇంతకంటే మంచి సమాధానం ఇంకేం ఉంటుందంటూ కామెంట్స్ చేస్తున్నారు.రూ. 27 కోట్ల పంత్ జీరో.. కేఎల్ రాహుల్ హీరో.. ఐపీఎల్ 2025లో రిషబ్ పంత్ ప్రదర్శన చాలా నిరాశపరిచింది.

## రాయుడు వల్లే ఆ వరల్డ్ కప్ మిస్ అయ్యింది! ధోని ఫ్రెండ్ ని ట్రోల్ చేస్తున్న గబ్బర్!



ఐపీఎల్ 2025 కామెంటరీ సమయంలో శిఖర్ ధావన్, అంబటి రాయుడు మధ్య జరిగిన సరదా సంభాషణ అభిమానులకు నవ్వు తెప్పించింది. ధావన్ చేసిన "వరల్డ్ కప్ మిస్" జోక్ రాయుడు గాయాన్ని తలపింపజేసినా, అతను దీన్ని ఓపికగా స్వీకరించాడు. 2019 ప్రపంచ కప్ ఎంపిక విషయంలో తీసుకున్న నిర్ణయం వెనుక కోహ్లీ కాకుండా మేనేజ్‌మెంట్ బాధ్యత వహించిందని రాయుడు తాజాగా స్పష్టం చేశాడు. ఆటగాడిగా అతని నిజాయితీ, తేజస్సు అభిమానుల మనసులను మళ్ళీ గెలుచుకున్నాయి.ఐపీఎల్ 2025 సీజన్ కేవలం ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లు మాత్రమే కాకుండా, ప్రేక్షకులకు మైదానం వెలుపల కొన్ని హాస్యభరితమైన క్షణాలను కూడా అందిస్తోంది. అలాంటి ఓ సరదా ఘటన, భారత మాజీ క్రికెటర్లు శిఖర్ ధావన్, అంబటి రాయుడు లైవ్ కామెంటరీ సమయంలో స్క్రీన్‌ను పంచుకున్నప్పుడు జరిగింది. ఈ ఇద్దరూ కామెంటేటర్లుగా కలిసి స్క్రీన్‌పై కనిపించడం, వారి మధ్య జరిగిన సరదా సంభాషణ అభిమానులను ఆకట్టుకుంది. ముఖ్యంగా, ధావన్ ఒక ఫన్నీ జోక్ వేసినప్పుడు "రాయుడు మన ప్రపంచ కప్‌ను కోల్పోయాడు" అని సరదాగా వ్యాఖ్యానించడం, ఆ క్షణాన్ని మరింత హాస్యంగా మార్చింది. ఇది 2004 %ఖ%19 ప్రపంచ కప్‌కు సంబంధించిన ఓ మధుర జ్ఞాపకాన్ని తెచ్చిపెట్టింది. ఆ టోర్నమెంట్‌లో రాయుడు కెప్టెన్‌గా ఉండగా, ధావన్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. సెమీఫైనల్ మ్యాచ్ ముందు ప్రవర్తనా నియమాలను ఉల్లంఘించిన రాయుడిని నిషేధించడం, తద్వారా భారత జట్టు ఓటమిపాలవడాన్ని ధావన్ సరదాగా గుర్తు చేశాడు. దీన్ని విని ఆకాష్ చోప్రా బాగా నవ్వగా, రాయుడు మొదట కాస్త అసహనం చూపించినా, వెంటనే నవ్వుల్లో పాలుపంచుకున్నాడు.ఈ సరదా సంఘటన పక్కన పెడితే, అంబటి రాయుడు ప్రయాణం మాత్రం ఎప్పుడూ చక్కని సమతుల్యతతో ఉండలేదు. అతని కెరీర్ పలు ఒడిదుడుకులను ఎదుర్కొంది. ఐసీఎల్ (ఇండియన్ క్రికెట్ లీగ్)లోకి వెళ్లడం, బీసీసీఐ నిషేధం ఎదుర్కొనడం, ఆ తర్వాత తిరిగి వచ్చి భారత జట్టులో స్థిరపడడం వరకూ ఎన్నో దశలను గడిపాడు. అయితే అతని కెరీర్‌లో అత్యంత చేదు ఘట్టం 2019 ఐసీసీ ప్రపంచ కప్ జట్టుకు ఎంపిక చేయబడకపోవడమే. అప్పట్లో అతని స్థానాన్ని విజయ్ శంకర్‌తో భర్తీ చేయడం, అది "త్రీ డైమెన్షనల్ ప్లేయర్" ఎంపికగా చెప్పబడడాన్ని అంబటి రాయుడు అప్పట్లో తనదైన శైలిలో వ్యంగ్యంగా సమాధానం చెప్పిన విషయం తెలిసిందే.అతను ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ, 2019 ప్రపంచ కప్ ఎంపిక విషయంలో విరాట్ కోహ్లీని నేరుగా నిందించలేనని, ఇది జట్టు మేనేజ్‌మెంట్ తీసుకున్న కలెక్టివ్ నిర్ణయమని పేర్కొన్నాడు. ఆయన స్పష్టంగా చెప్పినట్లుగా, ప్రధాన కోచ్ రవిశాస్త్రి, చీఫ్ సెలెక్టర్ ఎంఎస్కే ప్రసాద్ వంటి వారు ఆ నిర్ణయానికి కీలకంగా వ్యవహరించారని భావిస్తున్నానని వెల్లడించాడు. ఈ మేరకు, రాయుడు తన వేదనను హృదయపూర్వకంగా వ్యక్తీకరించినా, వ్యక్తిగతంగా ఎవరిపైనా ద్వేషం లేదని స్పష్టం చేశాడు.మొత్తంగా చూసినట్లయితే, ఐపీఎల్ 2025 కామెంటరీ సమయంలో జరిగిన ఈ సరదా సంఘటన వెనుక, ఓ ఆటగాడి జీవితంలోని గంభీరమైన సంఘటనలు దాగి ఉన్నాయి. శిఖర్ ధావన్ చేసిన ఫన్నీ వ్యాఖ్యలు ఓపికగా స్వీకరించిన రాయుడు, తన గతాన్ని తేటతెల్లంగా స్వీకరించడం ద్వారా అభిమానుల మనసులను గెలుచుకున్నాడు. ఒకప్పటి టీమ్‌మేట్లు ఇప్పుడు కామెంటేటర్లుగా కలిసి పనిచేయడం, భారత క్రికెట్‌కు సంబంధించి మధుర జ్ఞాపకాలను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చే ఓ అనుభూతిని అందిస్తోంది.

# ఏకమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మా ఐపీఓ ప్రారంభం.. పూర్తి వివరాలివే..




దిల్లీ: ప్రముఖ ఔషధ తయారీ సంస్థ ఏకమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ ఐపీఓ ప్రారంభమైంది. ఆగస్టు 1 వరకు మదుపర్లు షేర్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.ఐపీఓ షురు ధరల శ్రేణిని రూ.646-679గా కంపెనీ నిర్ణయించింది. గరిష్ఠ ధర వద్ద రూ.1,857 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.రూ.680 కోట్ల విలువ చేసే కొత్త షేర్లతో పాటు రూ.1,177 కోట్ల విలువతో కూడిన 1.73 కోట్ల ఈక్విటీలను ఆఫర్ ఫర్ సేల్ కింద ఐపీఓలో ఏకమ్స్ డ్రగ్స్ అందుబాటులో ఉంచింది. రూ.15 కోట్ల విలువ చేసే షేర్లను తమ ఉద్యోగులకు ప్రత్యేకంగా రిజర్వ్ చేసింది. ఈ ఐపీఓలో సమీకరించిన నిధులను రుణ చెల్లింపులు, నిర్వహణ మూలధన అవసరాలకు ఉపయోగించుకోనున్నట్లు తెలిపింది. మరికొన్ని నిధులను ఇతర కంపెనీల కొనుగోళ్లు, విలీనాలకు ఉపయోగిస్తామని వెల్లడించింది. మిగిలిన వాటిని కార్పొరేట్ అవసరాలకు వాడుకుంటామని పేర్కొంది.పబ్లిక్ ఇష్యూ పూర్తయిన తర్వాత ఏకమ్స్ డ్రగ్స్ కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.10,697 కోట్లుగా ఉంటుందని బ్రోకరేజీ సంస్థలు అంచనా వేశాయి.

ఐపీఓ పరిమాణంలో 75 శాతం అర్హత గల సంస్థాగత మదుపర్లు , 15 శాతం సంస్థాగతేతర మదుపర్లు, మిగిలిన 10శాతం రిటైల్ ఇన్వెస్టర్లకు ఇవ్వనున్నట్లు కంపెనీ తెలిపింది. మదుపర్లు రూ.14,938తో కనీసం 22 షేర్లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఐసీఐసీఐ సెక్యూరిటీస్, యాక్సిస్ క్యాపిటల్, సిటీ గ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ ఇండియా, యాంబిట్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ కంపెనీ ఐపీఓకి లీడ్ రన్నింగ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.ఏకమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాను 2004లో ఏర్పాటుచేశారు. ఇది ఒక 'కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్ సంస్థ'. భారత్ సహా విదేశీ కంపెనీలకు ఇది వివిధ రకాల ఫార్మా ఉత్పత్తులను తయారుచేస్తోంది. 2023 సెప్టెంబర్ 30 నాటికి అలెంబిక్ ఫార్మా, ఆల్కెమ్ లేబొరేటరీస్, సిప్లా, డాబర్ ఇండియా, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, హెటిరో హెల్త్‌కేర్, ఇప్కా ల్యాబ్స్, మ్యాన్‌కైండ్ ఫార్మా, మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్, మైక్రో ల్యాబ్స్, మైలన్ ఫార్మా, నాట్కో ఫార్మా, సన్ ఫార్మా, అమిషీ కన్స్యూమర్ టెక్ (ది మమ్స్ కంపెనీ) వంటి కంపెనీలు ఏకమ్స్ ఫార్మా క్లయింట్ల జాబితాలో ఉన్నాయి.

# బిజినెస్




## ఫ్లాట్‌గా ప్రారంభమైన మార్కెట్లు..

## సెన్సెక్స్ ఏ 81,320




ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం ఫ్లాట్‌గా ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు మన సూచీలపై ప్రభావం చూపుతున్నాయి.ఉదయం 9:24 గంటల సమయంలో సెన్సెక్స్ 62 పాయింట్లు నష్టపోయి 81,320 వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ 5 పాయింట్లు కోల్పోయి 24,830 వద్ద ట్రేడవుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.73 వద్ద ప్రారంభమైంది.సెన్సెక్స్-30 సూచీలో ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్, హెచ్‌యూఎల్, టాటా మోటార్స్, టెక్ మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టైటన్, నెస్లే ఇండియా, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్ అండ్ టీ, టాటా స్టీల్, సన్ ఫార్మా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, రిలయన్స్, ఎం అండ్ ఎం, యాక్సిస్ బ్యాంక్, ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.అమెరికా మార్కెట్లు సోమవారం మిశ్రమంగా ముగిశాయి. ఆసియా మార్కెట్లు నేడు నష్టాల్లో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ బ్రెంట్ చమురు ధర 79.45 డాలర్ల వద్ద కొనసాగుతోంది. విదేశీ సంస్థాగత మదుపర్లు సోమవారం నికరంగా రూ.2,475 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపర్లు రూ.5,666 కోట్ల వాటాలను కొనుగోలు చేశారు.

## హల్దీరామ్స్‌లో 51% వాటాకు బ్లాక్‌స్టోన్ రూ.40,000 కోట్ల బిడ్!

దేశీయ చిరుతిళ్ల ఉత్పత్తి సంస్థ హల్దీరామ్స్‌లో వాటా కొనుగోలు కోసం బ్లాక్‌స్టోన్ కొత్త ఆఫర్‌తో ముందుకు రావొచ్చని తెలుస్తోంది. తద్వారా భారత స్నాక్స్ మార్కెట్లోకి ఆ ప్రైవేటు ఈక్విటీ సంస్థ అడుగుపెట్టే అవకాశం కనిపిస్తోంది.హల్దీరామ్స్‌లో 51% వాటా కోసం రూ.40,000 కోట్ల వరకు బిడ్ దాఖలు చేయొచ్చని కొనుగోలు చర్చలతో సంబంధమున్న వ్యక్తులను ఉటంకిస్తూ ఒక ఆంగ్ల వార్తా సంస్థ పేర్కొంది. అంటే హల్దీరామ్స్ విలువను రూ.70,000-78,000 కోట్ల వరకు లెక్కగట్టినట్లు అవుతుంది. చర్చల అనంతరం తుది ఆఫర్ వివరాలు వెల్లడయ్యే అవకాశాలున్నాయి. ఈ ఒప్పందం జరిగితే ఒక శాశ్వత లైసెన్సు ద్వారా హల్దీరామ్స్ ఉత్పత్తుల వ్యాపారంపై బ్లాక్‌స్టోన్‌కు నియంత్రణ వస్తుంది.రెస్టారెంట్లు, బ్రాండ్ లైసెన్సులపై ఇంకా నిర్ణయం జరగలేదని ఆ వర్గాలు చెబుతున్నాయి. బ్రాండ్ హక్కులు, రెస్టారెంట్ కార్యకలాపాలపై హక్కులు హల్దీరామ్ కుటుంబానికే ఉండొచ్చని అంచనా. త్వరలోనే ఈ ఒప్పందం జరగడానికి అవకాశాలున్నాయని ఒక బ్యాంకరు పేర్కొన్నారు. విక్రయ నిబంధనల్లో భాగంగా హల్దీరామ్స్ బ్రాండ్‌ను ఉపయోగించుకున్నందుకు కొత్త యజమానుల నుంచి హల్దీరామ్ కుటుంబానికి వార్షిక రాయల్టీ లభించొచ్చు. ఈ అంశంపై వ్యాఖ్యానించడానికి హల్దీరామ్ సీఈఓ క్రిషన్ కుమార్ చుటానీ నిరాకరించారు.




# ఆరోగ్యం- మహాభాగ్యం

## ఈ క్యాండీల్ని తొక్క తీసే తినాలి!

చాక్లెట్, బిస్కెట్, క్యాండీ... ఇలా ఏదైనా కానీ రుచితోపాటూ రూపంలోనూ కాస్త వెరైటీగా కనిపిస్తేనే పిల్లల్ని మరింత ఆకట్టుకుంటుంది. అది దృష్టిలో పెట్టుకునే తయారీదారులు రకరకాల బొమ్మలతో వచ్చే తినుబండారాల్ని మార్కెట్లోకి తీసుకొస్తుంటారు.ఇక్కడున్న పీలబుల్ గమ్మీ క్యాండీ కూడా అలా తయారైందే. మామిడి, అరటి, ద్రాక్ష పండ్ల రుచులతో ఉండటమే కాదు, అచ్చంగా వాటిని తిన్న అనుభూతిని ఇవ్వడానికే ఇలా సరికొత్తగా ఆయా పండ్లలా పీలబుల్ రూపంలో వచ్చాయి. తొక్కతీసి అరటి పండును ఒలిచినట్టుగా పైనున్న పొరను తొలగించి లోపలున్న గమ్మీని గుటుక్కుమనిపించొచ్చు. పల్చని ఎలాస్టిక్ జెల్‌తో తయారుచేసిన బయటి పొర తీసిపారేసేదే అయినా దానివల్ల లోపలున్న గమ్మీకి ఎలాంటి ఇబ్బందీ ఉండదట. పుట్టినరోజులప్పుడు ఈ క్యాండీల్ని పంచారంటే- చూడ్డానికీ, తినడానికీ బుజ్జాయిలకు తమాషాగా ఉంటుంది మరి!



## డిజైనర్ కత్తెరలొచ్చాయ్!



గ్రీటింగ్ కార్డులూ, ఫొటోఫ్రేములూ, చార్ట్ పేపర్లూ తయారుచేసేప్పుడు కాగితపు అంచుల్ని అందంగా వంపులు వంపులుగా కత్తిరించాలంటే... పిల్లలకే కాదు, పెద్దలకూ చాలా సమయం పట్టేస్తుంది.అదే క్షణాల్లో కాగితం చుట్టూ డిజైన్ అంచుల్ని తేవాలనుకుంటే మాత్రం ఇక్కడున్న జిగ్‌జాగ్ పేపర్ షేపర్ సిజర్స్‌ని వాడితే సరి. మామూలుగా కత్తిరిస్తూనే పేపర్‌కి రకరకాల డిజైన్లు తెచ్చే యొచ్చు. వేరు వేరు కటింగ్ బ్లేడ్స్‌తో వీటిల్లో బోలెడన్ని రకాలున్నాయి. అంతేకాదు, ఆకులూ, పువ్వులూ, జంతువులూ, పక్షులూ, పండ్లూ... ఇలా ఎన్నెన్నో ముద్దొచ్చే ఆకారాల్లో కాగితాల్ని అలంకరిం చుకోవడానికి షేప్ పేపర్ పంచ్ సెట్ కూడా దొరుకుతోంది. ఈ వెరైటీ కత్తెరల్నీ, పంచ్ సెట్‌నీ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్ చేసే పిల్లలకు బహు మతిగా ఇచ్చి చూ డండి... కచ్చితంగా తమ ఆర్ట్‌లో ఇంకాస్త సృజనను చూపిస్తారు!

## గోంగూర తింటే.. ఈ సమస్యలకు చెక్ పెట్టొచ్చు..! లాభాలు తెలిస్తే అవాక్కే..



గోంగూరలో విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ బి 1, విటమిన్ బి2 , విటమిన్ బి 9, మెగ్నీషియం, కాల్షియం, ఫాస్ఫరస్, పొటాషియం, ఐరన్, రైబోఫ్లేవిన్, కెరోటిన్‌లు ఉన్నాయి.ఇవన్నీ కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. మనకు రోజూవారీగా కావాల్సిన విటమిన్ సిలో 53 శాతం గోంగూరలో ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. కాబట్టి, వారంలో రెండు సార్లైనా గోంగూర తింటే చాలా మంచిది.గోంగూర పూలను దంచి అరకప్పు రసం చేసి దాన్ని వడకట్టి దానిలో అరకప్పు పాలు కలిపి ఉదయం, సాయంత్రం రెండుపూటలా తాగితే. కంటికి మంచి జరుగుతుంది. గోంగూర ఆకుల పేస్ట్‌ను తలకు పట్టించి కొంతసేపు అయ్యాక స్నానం చేయాలి. దీనివల్ల జుట్టు రాలడం, చుండ్రు సమస్య తగ్గుతుంది.గోంగూరలో పొటాషియం, మెగ్నీషియం ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల హైబీపిని తగ్గిస్తుంది. వారంలో మూడు, నాలుగు సార్లు తీసుకుంటే.. హైబీపిని పూర్తిగా కంట్రోల్ చేస్తుంది. దగ్గు, ఆయాసం, తుమ్ములతో బాధపడేవారికి గోంగూర ఉపశమనం కలిగిస్తుంది. ఈ సమస్యతో బాధపడేవారు గోంగూర తినడం వల్ల ఫలితం ఉంటుంది.గోంగూరలో ఉండే క్లోరోఫిల్స్ క్యాన్సర్ కణాల పెరుగుదలని కంట్రోల్ చేస్తాయి. కాబట్టి, ఈ గోంగూరని హ్యాపీగా తినొచ్చు. అంతే కాకుండా దీనిని పులిహోరలా చేసుకుని కూడా తినొచ్చు. గోంగూర నుంచి తీసిన జిగురును నీటిలో కలిపి తాగితే విరేచనాలు తగ్గుతాయి.పీరియడ్స్ సమయంలో మహిళలు కాళ్లు లాగడం, నడుం వంటి సమస్యలతో బాధపడుతుంటారు. నీరసంగా ఉంటారు. ఇలాంటి సమయంలో గోంగూర తినడం వల్ల వారి శరీరానికి శక్తి లభిస్తుంది. ఎముకలను దృఢంగా ఉంచడంలో, విరిగిన ఎముకలు త్వరగా అతుకునేలా చేయడంలో గోంగూర ఉపయోగపడుతుంది. గోంగూరలో మెగ్నీషియం, ఫాస్ఫరస్, కాల్షియం పుష్కలంగా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల ఎముకలు బలంగా మారుస్తుంది. అంతేకాదు, ఈ గోంగూరని తీసుకోవడం వల్ల జుట్టు ఆరోగ్యం మెరుగ్గా మారుతుంది.




నందమూరి బాలకృష్ణ మాస్ హీరో మాత్రమే కాదు... శాసనసభ్యుడు కూడా. దాంతో ఆయన బర్త్ డే గురించిన ప్లానింగ్స్ ఇప్పటి నుండే కాబోతున్నాయి.నటసింహ బాలకృష్ణ బర్త్ డే అంటే అభిమానులకు పండగే... ఆ ఫెస్టివల్ కు ఫ్యాన్స్ లో మహదానందం నింపాలనే బాలయ్య కూడా ప్రయత్నిస్తుంటారు... ఈ సారి రాబోయే బాలయ్య బర్త్ డే ఫ్యాన్స్ కు ఓ స్పెషల్ అంటున్నారు... ఆ ముచ్చటేంటో చూద్దాం...ఈ సారి బాలయ్యకు 65 ఏళ్ళు!.. టాప్ స్టార్స్ బర్త్ డేస్ ను ఫ్యాన్స్ భలేగా సెలబ్రేట్ చేసుకుంటూ ఉంటారు. తమ అభిమాన హీరోల పుట్టినరోజుకు పలు సేవాకార్యక్రమాలు చేయడం చేస్తూ ఉంటారు ఫ్యాన్స్. ఈ ట్రెండ్ ఎప్పటి నుంచో ఉన్నదే. బాలకృష్ణ బర్త్ డే అయిన జూన్ 10వ తేదీన అభిమానులు ఊరూరా సంబరాలు చేసుకుంటూ ఆసుపత్రుల్లో రోగులకు పాలు, పండ్లు ఇవ్వడం, పేదవిద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేయడం, రక్తదానం నిర్వహించడం, కొన్ని చోట్ల పేదవారికి అన్నదానం చేయడం లాంటివి చేస్తూనే ఉన్నారు. గతంలో అయితే బాలయ్య బర్త్ డేను ఆయన అభిమాన నిర్మాత భార్గవ్ ఆర్ట్స్ అధినేత యస్. గోపాల్ రెడ్డి ప్రతి యేటా ఘనంగా నిర్వహించేవారు. ఆ వేడుకలను అభిమానులు ఈ నాటికీ తలచుకుంటూనే ఉన్నారు. బాలయ్య బర్త్ డేన ఆయన కొత్త సినిమాలను ఆరంభించడం, లేదా న్యూ ప్రాజెక్ట్స్ డీటెయిల్స్ ప్రకటించడం చేసేవారు. ఈ సారి బాలయ్య 65 ఏళ్ళు పూర్తి చేసుకుంటున్నారు. అందువల్ల బాలయ్య జన్మదినోత్సవాన్ని ప్రత్యేకంగా నిర్వహించాలని ఫ్యాన్స్ అభిలాష. ఊరూరా ఎవరికి వారు చేతనైన తీరున సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలుస్తోంది. అలాగే ఈ బర్త్ డేకు రెండు ముచ్చట్లు అభిమానులను మురిపించనున్నాయి.ఈ సారి బాలకృష్ణ బర్త్ డేకు ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'అఖండ-2' కు సంబంధించిన టీజర్ రిలీజ్ కానుందని తెలుస్తోంది. యాక్షన్ మూవీస్ తెరకెక్కించడంలోనే కాదు తన సినిమాల టీజర్, ట్రైలర్స్ ను కట్ చేసి ఆకట్టుకోవడంలోనూ మేటి అనిపించుకున్నారు బోయపాటి శ్రీను అందునా ఆయనకు అచ్చివచ్చిన బాలకృష్ణతో సినిమా కాబట్టి, ట్రైలర్ కట్ మరింత ఇంట్రెస్టింగ్ గా ఉంటుందని టాక్... అలా జూన్ 10వ తేదీ బాలయ్య బర్త్ డేను పురస్కరించుకొని ఓ రోజు ముందుగానే అంటే జూన్ 9 సాయంత్రం ఓ శుభముహూర్తాన 'అఖండ-2' టీజ్ జనం ముందుకు రానుంది.మరో కొత్త సినిమా...'అఖండ -2' టీజర్ తో పాటు బాలయ్య బర్త్ డేకు మరో విశేషం కూడా చోటు చేసుకోనుంది... బాలయ్యతో 'వీరసింహారెడ్డి' వంటి బంపర్ హిట్ తీసిన గోపీచంద్ మలినేని ఆయనతో మరో సినిమాను తెరకెక్కించే ప్రయత్నం చేస్తున్నారు. ఆ సినిమాకు సంబంధించిన అనౌన్స్ మెంట్ జూన్ 10వ తేదీన వెలువడనుంది... ఈ రెండు ముచ్చట్లతో పాటు ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న బాలయ్య వారసుడు మోక్షజ్ఞ ఎంట్రీ గురించిన అసలైన మేటర్ కూడా ఆ రోజునే వినిపిస్తుందనీ ఇన్ సైడ్ టాక్... మరి రాబోయే బాలయ్య బర్త్ డేన ఇంకా ఏ యే అంశాలు అభిమానులకు ఆనందం పంచుతాయో చూడాలి.

# అర్జున్ సన్నాఫ్ వైజయంతి రివ్యూ

'బింబిసార' చిత్రం తర్వాత నందమూరి కళ్యాణ్ రామ్ నటించిన 'అమిగోస్', 'డెవిల్' చిత్రాలు ఆశించిన స్థాయిలో ఆడలేదు. దాంతో కాస్తంత వేగాన్ని తగ్గించి, కళ్యాణ్ రామ్ 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జాతీయ ఉత్తమనటి విజయశాంతి (%ఎఱయిఘిఘియిథ్ష్ణఱ%) తో మదర్ సెంటిమెంట్ మూవీ చేసి, తిరిగి సక్సెస్ ట్రాక్ లోకి రావాలని కళ్యాణ్ రామ్ భావించాడు. మరి అతని కోరిక నెరవేరిందో లేదో తెలుసుకుందాం.

కథ ఏమిటంటే...'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' కథేమిటంటే... ఐపీఎస్ అధికారిణి వైజయంతి (విజయశాంతి) తన కొడుకు అర్జున్ (కళ్యాణ్ రామ్) కూడా తనలానే ఐపీఎస్ ఆఫీసర్ కావాలని కలలు కంటుంది. కోస్ట్ గార్డ్ ఆఫీసర్ అయిన అర్జున్ తండ్రి విశ్వనాథ్ (ఆనంద్) ను స్మగ్లర్ మాణిక్యం, అతని తమ్ముడు పైడితల్లి హత్య చేసి శవాన్ని మాయం చేస్తారు. వాళ్ళ మీద పగ తీర్చుకోవడానికి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, కోర్టు ద్వారా వారికి శిక్షపడేట్టు చేద్దామని తల్లి వైజయంతి కొడుక్కి నచ్చచెబుతుంది. చట్టంలోని లొసుగుల కారణంగా శిక్ష పడకుండా తప్పించుకున్న పైడితల్లి, తన తల్లిని కూడా చంపుతానని హెచ్చరించడంతో తట్టుకోలేక కోర్టు ఆవరణలోనే అతన్ని చంపేస్తాడు అర్జున్. పోలీసులకు లొంగిపొమ్మని వైజయంతి కొడుకును కోరుతుంది. కానీ అతనేమో తనను నమ్ముకున్న మత్స్యకారులను కాపాడటం కోసం వైజాగ్ సిటీలో సమాంతర ప్రభుత్వాన్ని నడిపే ప్రయత్నం చేస్తాడు. హంతకుడనే ముద్ర పడిన అర్జున్ తల్లికి దూరమై ఓ పక్క తల్లడిల్లుతుంటే... ఆమె కారణంగా జైలు పాలైన పఠాన్ (సోహైల్ ఖాన్) అక్కడ నుండి తప్పించుకుని వచ్చి ఆమెను హతమార్చాలనుకుంటాడు. తల్లిని పఠాన్ బారినుండి అర్జున్ ఎలా కాపాడాడు? అందుకోసం ఏం త్యాగం చేయాల్సి వచ్చింది? అనేది ఈ చిత్ర కథ.

విశ్లేషణ...విజయశాంతి దాదాపు పదిహేనేళ్ళ తర్వాత 'సరిలేరు నీకెవ్వరు' మూవీతో రీ-ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత ఐదేళ్ళకు ఇప్పుడు 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' మూవీలో నటించింది. ఇంతగా ఆమె ఆచితూచి పాత్రలను ఎంచుకుంటోందంటే... ఈ కథలో ఏదో దమ్ము ఉందని అంతా భావించారు. విజయశాంతి, కళ్యాణ్ రామ్ తల్లీ కొడుకులుగా వెండితెరపై భావోద్వేగాలను అద్భుతంగా పండిస్తారని ప్రేక్షకులు ఆశపడ్డారు. నిజానికి ఇది మదర్ సెంటిమెంట్ తో తీసిన సినిమానే. కాకపోతే ఐపీఎస్ అధికారి అయిన వైజయంతి, పారలల్ గవర్నమెంట్ ను నడిపే ఆమె కొడుకు అర్జున్ ఇద్దరు కలిసి... సినిమా ప్రారంభం నుండి ముగింపు వరకూ అసాంఘిక శక్తులను ఏరివేయడానికి రక్తాన్ని వరదలా వెండితెరపై పారించారు. దాంతో మదర్ సెంటిమెంట్ అనే దానికి ప్రాధాన్యం తగ్గిపోయింది. ఈ హై యాక్షన్ డ్రామాలో అప్పుడప్పుడూ, అక్కడక్కడా సెంటిమెంట్ సీన్స్ ను దర్శకుడు జత చేస్తూ వచ్చాడు. ఫ్యామిలీ సెంటిమెంట్ యాక్షన్ డ్రామా అని మేకర్స్ చెప్పినా... ఉన్నదంతా యాక్షన్ సీన్సే!నటీనటులు... సాంకేతిక నిపుణులు...విజయశాంతి ఎలాంటి పాత్రనైనా అద్భుతంగా పోషించగలదు. ఇక ఖాకీ డ్రస్ ధరిస్తే... ఆమె స్క్రీన్ ప్రెజెన్స్ వేరే లెవల్ లో ఉంటుంది. ఇందులోనూ అంతే... ఐపీఎస్ అధికారిగా ఆమె చేసే పోరాటాలు ఆకట్టుకుంటాయి. కాకపోతే సెంటిమెంట్ సీన్స్ చిత్రీకరణలో బలం లేకపోవడంతో ఆ యా సన్నివేశాలు తేలిపోయాయి. కళ్యాణ్ రామ్ సైతం సెంటిమెంట్ పండించడం మీద కంటే యాక్షన్ హీరోగా తనను తాను ప్రూవ్ చేసుకోవడానికే ఎక్కువ ప్రయత్నించాడు. ఆ విషయంలో సక్సెస్ అయ్యాడు. హీరోయిన్ సాయి మంజ్రేకర్ పాత్రకు పెద్దంత ప్రాధాన్యం లేదు. విలన్ సోహైల్ ఖాన్ పాత్రనూ చెప్పుకోదగ్గ రీతిలో దర్శకుడు మలచలేదు. ఉన్నంతలో శ్రీకాంత్, పృథ్వీ, ఆనంద్ తమదైన నటనతో మెప్పించారు. వీరి పాత్రలు సినిమాకు కాస్తంత బలాన్ని చేకూర్చాయి. కాస్తంత గుర్తింపు ఉన్న నటీనటులు చాలా మందే ఇందులో వున్నా, ఎవరిదీ చెప్పుకోదగ్గ పాత్ర కాదు.గురువారం విడుదలైన 'ఓదెల -2' కు సంగీతం అందించిన అజనీశ్ లోక్ నాథ్ఈ సినిమాకూ మ్యూజిక్ ఇచ్చారు. అతను అందించిన నేపథ్య సంగీతం యాక్షన్ సీన్స్ ను ఎలివేట్ చేసింది. బట్... ఏ పాటా చెప్పుకోదగ్గదిగా లేదు. రాంప్రసాద్ సినిమాటోగ్రఫీ బాగానే ఉంది. గెస్ట్ రోల్ లోనూ రాంప్రసాద్ మెరపులా మెరిశారు. సంభాషణలు బాగున్నాయి. యాక్షన్ కొరియోగ్రాఫర్స్ పడిన శ్రమ తెర మీద కనిపిస్తోంది. అయితే... మూవీ టైటిల్, మేకర్స్ చెప్పిన మాటలు నమ్మి... ఇదేదో మదర్ సెంటిమెంట్ చిత్రం అనే భావనతో వచ్చిన వారు కొంత నిరాశకు గురికాకతప్పదు. మాస్, యాక్షన్ సినిమాలను ఇష్టపడేవారికి నచ్చే ఆస్కారం ఉందిూస్తవానికి హీరోకి సంబంధించిన ఎలివేషన్ షాట్స్ మీద పెట్టిన దృష్టి కథ, కథనాల మీద దర్శకుడు ప్రదీప్ చిలుకూరి పెట్టి ఉంటే... సినిమా కొంతలో కొంత బెటర్ గా ఉండేది.

అలా చేయకపోవడంతో ఇది రొటీన్ యాక్షన్ డ్రామాగా మిగిలిపోయింది. నిర్మాతలు అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు ఖర్చు విషయంలో వెనకాడలేదు. ఈ మధ్యకాలంలో వచ్చిన సినిమాలతో పోల్చితే... 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'కి మంచి ఓపెనింగ్స్ లభించడం పాజిటివ్ సైన్ అనే చెప్పాలి!





# పెళ్ళి వేడుకల్లో మారుమ్రోగేలా జింగుచా సాంగ్....

కమల్ హాసన్ నటించిన 'థగ్ లైఫ్' నుంచి మొదటి సింగిల్ 'జింగుచా'ను గ్రాండ్‌గా రిలీజ్ చేశారు. లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో శింబు, త్రిష కృష్ణన్, ఐశ్వర్య లక్ష్మి, అశోక్ సెల్వన్, అభిరామి, జోజు జార్జ్, నాసర్, అలీ ఫజల్, సన్యా మల్హోత్రా వంటి వారు ఇతర ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ఫస్ట్ సింగిల్ లాంచ్ కోసం నిర్వహించిన ఈవెంట్‌తో దేశం మొత్తం 'థగ్ లైఫ్' వైపు చూసింది. ఈ వేడుకల్లో కమల్ హాసన్, మణిరత్నం, ఎ. ఆర్. రెహమాన్ పాల్గొని సందడి చేశారు. పెళ్లి వేడుకల్లో మార్మోగిపోయేలా 'జింగుచా' అనే ఫస్ట్ సింగిల్‌ను శుక్రవారం రిలీజ్ చేశారు. ఈ పాటకు కమల్ హాసన్ సాహిత్యాన్ని అందించగా, రెహమాన్ బాణీలు సమకూర్చారు.

'థగ్ లైఫ్' చిత్రాన్ని తమిళనాడులో రెడ్ జెయింట్ మూవీస్, ఓవర్సీస్‌లో హోమ్ స్క్రీన్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో, ఎ.పి. ఇంటర్నేషనల్ సంయుక్తంగా రిలీజ్ చేస్తున్నాయి. ఇక నార్త్ ఇండియాలో పెన్ మరుధర్ సినీ ఎంటర్‌టైన్‌మెంట్, తెలుగులో శ్రేష్ట్ మూవీస్ విడుదల చేయబోతున్నాయి. కర్ణాటకలో ఫైవ్ స్టార్ సెంథిల్ సంస్థ ఈ చిత్రాన్ని భారీ ఎత్తున విడుదల చేస్తోంది. థగ్ లైఫ్' ఆడియో హక్కులను సారెగామా భారీ రేటుకి సొంతం చేసుకోగా, డిజిటల్ హక్కుల్ని నెట్‌ఫ్లిక్స్ చేజిక్కించుకుంది. జూన్ 5, 2025న ప్రపంచవ్యాప్తంగా 'థగ్ లైఫ్' థియేటర్లలో విడుదలకు సిద్ధం అవుతోంది. జస్ట్ గ్రో ప్రొడక్షన్స్ సహకారంతో 'థగ్ లైఫ్' ఫెస్టివల్‌ను కూడా టీం ప్రకటించింది. ఇది మే 23వ తేదీన శుక్రవారం ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరగనుంది. ఆ మ్యూజికల్ ఈవెంట్‌లో ఏఆర్ రెహమాన్ కూడా ప్రదర్శన ఇవ్వనున్నారు.

# నేచురల్ స్టార్ నాని డెడికేషన్‌కు అంతా ఫిదా అవ్వాల్సిందే

నేచురల్ స్టార్ నాని అటు నిర్మాతగా, ఇటు హీరోగా వరుస విజయాల్ని సొంతం చేసుకుంటూ వార్తల్లో నిలుస్తున్నారు. నేచురల్ స్టార్ నాని అటు నిర్మాతగా, ఇటు హీరోగా వరుస విజయాల్ని సొంతం చేసుకుంటూ వార్తల్లో నిలుస్తున్నారు. దసరా నుంచి తన స్ట్రాటజీని మార్చుకున్న నాని అదే పంథాలో వరుస సక్సెస్‌లు సాధిస్తూ హీరోగా దూసుకుపోతున్నారు. ఇదే ఊపులో ఆయన నటించిన లేటెస్ట్ మూవీ హిట్ 3 మే 1న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇప్పటికే విడుదలైన ఈ మూవీ ట్రైలర్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది.

దీనికి ఏమాత్రం తీసిపోని స్థాయి నేచురల్ స్టార్ నాని హిట్ 3 ప్రమోషన్స్‌ని జోరుగా చేస్తూ తన చక్కని ప్లానింగ్‌తో అందరిని ఫిదా చేస్తున్నారు. హీరోగా నటించడంతో పాటు ఈ మూవీకి తానే నిర్మాత కావడంతో రెండు బాధ్యతల్ని సమ్మవంతంగా పోషిస్తున్న నాని ప్రమోషన్స్ విషయంలో జోరు పెంచారు. సినిమా రిలీజ్‌కు మరో వారం రోజులు మాత్రమే ఉండటంతో పాన్ ఇండియా వైడ్‌గా ప్రమోషన్స్ చేస్తూ నాని హల్ చేస్తున్నారు.




సినిమా ప్రమోషన్స్ కోసం తనతో పాటు హీరోయిన్ శ్రీనిధిశెట్టిని కూడా రంగంలోకి దించేసిన నాని దేశంలోని మేజర్ సిటీస్‌లో పర్యటిస్తూ ప్రమోషన్స్ ని హీటెక్కిస్తున్నారు. యుఎస్‌లోనూ నానితో కలిసి శ్రీనిధిశెట్టి ఈ మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొనబోతున్నారు. ఇందు కోసం ఏప్రిల్ 30న యుఎస్‌కు వెళ్లబోతున్నారు. మే 6 వరకు అక్కడే ప్రమోషన్స్ చేయబోతున్నారు.డల్లాస్, ఆస్టిల్, సేటిల్, లాస్ ఏంజిల్స్, కాన్సాస్‌లలో పర్యటించి అక్కడి అభిమానులతో ఇంటరాక్ట్ కానున్నారు. కోర్ట్ తో పాటు తన ప్రీవియస్ సినిమాల ప్రమోషన్స్ కోసం కూడా ఇదే స్థాయిలో ప్రమోట్ చేసిన నాని హిట్ 3 కోసం కూడా తనదైన డెడికేషన్‌తో ప్రమోషన్స్‌లో పాల్గొంటుండటం అందరిని ఫిదా చేస్తోంది. సినిమా అందరికి చేరాలనే లక్ష్యంతో నాని చేస్తున్న పబ్లిసిటీకి అంతా ఫిదా అవుతున్నారు. నాని, శ్రీనిధిశెట్టి యుఎస్ టూర్ షెడ్యూల్‌కి సంబంధించిన పోస్టర్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. నానికి సినిమాపై ఉన్న డెడికేషన్‌కు అంతా ముచ్చటపడుతున్నారు.

Prajajwala Telugu Daily : Printer, Publisher and Owned by APPIKONDA BHAVANI ,[LATE] A.BHASKAR RAO, Head Office: Vizag, T.S.Branch Office Address: plot no: 204, Road No:7 venus Rocks Heights, Devendra Nagar-Gajularamaram Quthbullapur, Hyderabad- 500055: prajajwalatelangana@gmail.com cell. no. 9700070315, RNI No. APTEL 2010/33400.